ప్రేమతో మాట్లాడు
ఆలోచించి మాట్లాడు
అర్థం చేసుకొని మాట్లాడు
మంచి మాట్లాడు
తెలివిగా మాట్లాడు
నవ్వుతూ మాట్లాడు
మనస్సు విప్పి మాట్లాడు
పూర్తిగా విన్న తరువాత మాట్లాడు
మనస్సు నొప్పించకుండా మాట్లాడు
తక్కువ మాట్లాడు



TGTEL/25/A1132

మానవాళికి

# జనంవార్త

ప్రతి అక్షరం.. జనం కోసం..

Q6 NEWS తెలుగు

మేడ్చల్ | ఆదివారం | 30.08.2026 | సంపుటి : 2 | సంచిక : 58 | పేజీలు : 8 | వెల : 5/- | ఎడిటర్ : గడ్డమీది నాగరాజు పటేల్




## ముఖ్యమంత్రిని పనిచేసుకోనివ్వాలి

- కేబినేట్ పునర్వ్యవస్థీకరణతో కొత్తదనం తేవాలి
- మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు

03



## సీజన్ వ్యాధుల పట్ల అప్రమత్తం కండి

అధికారులతో సమీక్షలో మంత్రి దామోదర ఆదేశాలు

03



# 92.86 లక్షల ఓట్ల తొలగింపుపై సమగ్ర పరిశీలన

## సర్ ప్రక్రియ గడువును మరో నాలుగు వారాలు పొడిగించాలి

**73.39 లక్షల మంది ఓటర్లను ఏఎస్‌డీడీ లిస్ట్‌లో పెట్టడం ఆందోళనకరం**

**శాశ్వత, తాత్కాలిక వలసల మధ్య వ్యత్యాసాన్ని గుర్తించలేకపోయారు**

**ఆధారాలు చూపించుకోకపోతే ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం**

**కేంద్ర ఎన్నికల సంఘానికి సిఎం రేవంత్ రెడ్డి లేఖ**

హైదరాబాద్, ఆగస్ట్ 29 : ఓటర్ల జాబితా సవరణలో భాగంగా పెద్ద సంఖ్యలో ఓట్ల తొలగింపుపై సీఎం రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. దాదాపు 92.86లక్షల ఓట్ల తొలగింపుకు సంబంధించిన సమగ్ర పరిశీలన అవసరమని ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లారు. ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై అభ్యంతరాలు,క్లెయిమ్‌ల గడువు పొడిగించాలని కోరుతూ.. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్‌కు సీఎం రేవంత్‌రెడ్డి లేఖ రాశారు. అక్టోబర్ 19తో గడువు ముగుస్తున్నందున మరో 4 వారాలు పెంచాలని సీఎం విజ్ఞప్తి చేశారు. సమీప భవిష్యత్తులో ఎలాంటి ఎన్నికలు లేనందున గడువు పెంచాలని కోరారు. 'సర్'కు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తోందని తెలిపారు. ఓటర్ల పరిశీలనలో అనేక లోపాలు ఉన్నాయని, ఇళ్లు మారితే నోటీసు ఇవ్వకుండా ఓట్లు తొలగించవద్దని కోరారు. గ్రామ, వార్డు సభల్లో ముసాయిదా ఓటర్ జాబితాను కనీసం రెండుసార్లు

-మిగతా 2 లో..

## తెలంగాణ చెరువుల పునరుద్ధరణ అత్యావశ్యకం

చిన్ననీటి పారుదల వ్యవస్థను బలోపేతం చేయాలి

02

సిఎం రేవంత్ రెడ్డికి రైతు కమిషన్ నివేదిక

# నేడు నీట్ పీజీ-2026 ఎంట్రెన్స్ టెస్ట్

## పటిష్ట ఏర్పాట్లు చేసిన వరంగల్ పోలీసులు




వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఆదివారం జరగనున్న నీట్ పీజీ-2026 పరీక్షల నేపథ్యంలో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిషేధాజ్ఞలు అమలులో ఉంటుందని పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత తెలిపారు. పరీక్షా కేంద్రాలకు 500 మీటర్ల పరిధిలో ఐదుగురికి మించి గుంపులుగా చేరరాదని ఆమె సూచించారు. ఈ ప్రాంతాల్లో సభలు, సమావేశాలు, ర్యాలీలు, ధర్నాలు, ప్రచార కార్యక్రమాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు.

వరంగల్, ఆగస్ట్ 29 : మైకులు, డీజేలతో ఊరేగింపులకూ అనుమతి ఉండదన్నారు. పరీక్షలు జరిగే సమయంలో కేంద్రాల పరిసరాల్లోని ఇంటర్నెట్ కేంద్రాలు, జిరాక్స్ దుకాణాలు, స్టేషనరీ షాపులను మూసివేయాలని ఆదేశించారు. పరీక్ష నిర్వహణకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద భారీ పోలీసు బందోబస్తుతో పాటు ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు కమిషనర్ పేర్కొన్నారు. పరిసర ప్రాంతాల్లో పోలీసు పెట్రోలింగ్ కోసం

-మిగతా 2 లో..



# ధనిక రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిన బిఆర్ఎస్

**వడ్డీలకే సంపాదన అంతా ఖర్చు చేస్తున్నాం**

**మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

ధనిక తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా చేసినా సంక్షేమం ఆగడంలేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ధనిక రాష్ట్రం అంటూ గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందన్నారు. చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేక తాము ఎంతో యాతన పడుతున్నామని అన్నారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. జిల్లాలోని నూతనకల్, మద్దిరాల మండలాల్లో 15 గ్రామాల్లో సుమారు మూడు వేల ఎకరాలకు సంబంధించిన భూమి పట్టాలను అందజేస్తున్నామన్నారు.

సూర్యాపేట, ఆగస్ట్ 29 : పిల్లల చదువు కోసం, అవసరాల కోసం భూమిని అమ్ముకొనే అవకాశం లేక ఇబ్బంది పడుతున్న విషయాన్ని తన దృష్టికి తీసుకవచ్చారని తెలిపారు. ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంది కాబట్టే పట్టాదార్ పాస్‌బుక్కులను పంపిణీ చేస్తున్నామని చెప్పారు. 'మీరు తలక్రిందులుగా తపస్సు చేసినా మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుంది' అని మంత్రి స్పష్టం చేశారు. 63 వేల కోట్ల ఆడబిడ్డలకు సున్నా వడ్డీకి

-మిగతా 2 లో..

# భవిష్యత్ పోరాటాలపై బీజేపీ కసరత్తు

## 22ఎ భూములపై త్వరలోనే కార్యాచరణ

**పార్టీ నేతలతో బిజెపి చీఫ్ రాంచందర్ రావు సమీక్ష**



హైదరాబాద్, ఆగస్ట్ 29 : తెలంగాణలో తమ పార్టీని బలోపేతం చేసే దిశగా బీజేపీ కసరత్తులు చేస్తోంది. ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు తమ గొంతుకను వినిపిస్తోంది. ఈ మేరకు ఆ పార్టీ చీఫ్ రాంచందర్ రావు అధ్యక్షతన ఫీజు బకాయిల చెల్లింపు కోసం ఇటీవల దీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. మరో రెండు పోరాటాలకు బీజేపీ నాయకులు సన్నద్ధమవుతున్నారు. 22-ఏలో చేర్చిన భూమి సంబంధించిన బాధితులకు అండగా నిలిచేందుకు వచ్చే నెల 5,6 తేదీల్లో టీబీజేపీ నేతలు మరో దీక్ష నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో శనివారం రాంచందర్ రావు అధ్యక్షతన సమావేశం జరగనుంది. ఈ భేటీలో బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొననున్నారు. ఈ సమావేశంలో 22-ఏ వ్యవహారంపై చేసే దీక్షపై

-మిగతా 2 లో..




# గోల్ఫ్ టూరిజం హబ్‌గా తెలంగాణ

**బ్రాండ్ అంబాసిడర్‌గా కపిల్ దేవ్**

**మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడి**

పర్యాటకం, క్రీడల ప్రచారానికి కపిల్‌దేవ్ సేవలు వినియోగించుకుంటామని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. తెలంగాణ గోల్కొండ మాస్టర్స్ 12వ ఎడిషన్ నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. శామీర్‌పేట సమీపంలోని జవహర్‌నగర్‌లో 130 ఎకరాల్లో గోల్ఫ్ కోర్సు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా గోల్ఫ్ క్రీడాకారులను ఆకర్షించేలా మౌలిక వసతులు అభివృద్ధి చేస్తామన్నారు.

హైదరాబాద్, ఆగస్ట్ 29 : తెలంగాణ రాష్ట్రాన్ని అంతర్జాతీయ పర్యాటక, క్రీడా రంగంలో ముందంజలో నిలిపేందుకు ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. అందులో భాగంగా క్రీడలు, పర్యాటక రంగాలు రెండింటినీ మిళితం చేస్తూ తెలంగాణను 'గోల్ఫ్ టూరిజం హబ్'గా తీర్చిదిద్దేందుకు సమగ్ర ప్రణాళికను సిద్ధం చేసింది. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి

-మిగతా 2 లో..



## నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 135 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 162 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 235 (కిలో) |
| స్కిన్ లెస్ | 267 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹74

# మెట్రో స్టేషన్లలో ఆన్‌లైన్ సమస్యలు

**ఎంట్రీ, ఎగ్జిట్ గేట్లు తెరుచుకోక ప్రయాణికుల ఇబ్బంది**

**అంతా సర్దుకుందంటున్న మెట్రో అధికారులు**



03



# 7 నుంచి తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు

**సర్క్యులర్ విడుదల చేసిన కార్యదర్శి**

హైదరాబాద్, ఆగస్ట్ 29 : తెలంగాణ శాసనసభ, శాసన మండలి సమావేశాలకు సంబంధించి ముహూర్తం ఖరారైంది. సెప్టెంబర్ 7వ తేదీ నుంచి తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్నట్లు అసెంబ్లీ కార్యదర్శి అధికారిక సర్క్యులర్ జారీ చేశారు. సెప్టెంబర్ 7న ఉదయం

-మిగతా 2 లో..

# నేపాల్‌లో మృత్యుంజయులు

**చనిపోయారనుకున్న ఇద్దరు తనయులు రాక**

**కన్నీటి పర్యంత నుంచి తేరుకున్న తల్లి ఆనందబాష్పాలు**



03

## భవిష్యత్ పోరాటాలపై బీజేపీ కసరత్తు

(మొదటిపేజీ తరువాయి)

సుదీర్ఘంగా చర్చ జరగనున్నట్లు సమాచారం. దీక్షకు సంబంధించిన కార్యాచరణపై రాంచందర్ రావు నాయకులకు దిశానిర్దేశం చేయనున్నారు. అంతేకాకుండా రాష్ట్రంలో పార్టీ బలాబలాలపై కూడా చర్చించనున్నట్లు తెలుస్తోంది. పార్టీని బలోపేతం చేసే దిశలో భవిష్యత్తు కార్యాచరణపై కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. ఈ సమావేశం అనంతరం బీజేపీ తదుపరి కార్యాచరణపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు క్లారిటీ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. మరోవైపు ఫసల్ బీమా పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదిలాబాద్ నుంచి అసెంబ్లీ వరకు రైతుయాత్ర చేపట్టేందుకు పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పాయల్ శంకర్ సిద్ధమవుతున్నారు.




## నేడు నీట్ పిజి ఎంట్రెన్స్ టెస్ట్

(మొదటిపేజీ తరువాయి)

ప్రత్యేక బృందాలను నియమించినట్లు తెలిపారు. అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిఘాను మరింత పెంచామని, అవసరమైన సమాచారం సేకరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామని చెప్పారు. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. పరీక్షల సజావు నిర్వహణకు ప్రజలు, రాజకీయ పార్టీలు, వివిధ సంఘాల ప్రతినిధులు పోలీసులకు సహకరించాలని కమిషనర్ ఎన్. శ్వేత విజ్ఞప్తి చేశారు.



## 7 నుంచి తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు

(మొదటిపేజీ తరువాయి)

10 గంటల నుంచి సభలు ప్రారంభమవుతాయని పేర్కొంటూ అసెంబ్లీ అధికారులు శాసనసభ సభ్యులతో పాటు శాసన మండలి సభ్యులకు కూడా సమాచారాన్ని అందిస్తూ సర్క్యులర్‌ను పంపించారు. తెలంగాణలో వర్షాకాల అసెంబ్లీ సమావేశాలు సెప్టెంబర్‌లోనే నిర్వహిస్తామని ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే గత బీఆర్ఎస్ 10 ఏళ్ల పాలన, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై సభలో విస్తృతంగా చర్చకు సిద్ధమని ప్రతిపక్షాలకు సీఎం రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. అంతేకాకుండా మాజీ సీఎం కేసీఆర్ కూడా అసెంబ్లీకి వచ్చి ఈ చర్చలో పాల్గొనాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సమావేశాల్లో ప్రభుత్వ విధానాలు, అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలతో పాటు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, సాగునీటి ప్రాజెక్టులు తదితర అంశాలను లోతుగా చర్చించే అవకాశం ఉంది. రాష్ట్రంలో ప్రస్తుతం మారిన రాజకీయ పరిణామాలు, రగులుతున్న సామాజిక అంశాల నేపథ్యంలో సెప్టెంబర్ 7 నుంచి ప్రారంభమయ్యే ఈ అసెంబ్లీ సమావేశాలు రాష్ట్ర రాజకీయాల్లోనే అత్యంత కీలకంగా మారనున్నాయి.



## ఉత్తరాఖండ్ 'శుద్ధీకరణ' ఘటనపై కఠిన చర్యలు

- వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు
- బిజెపి తీరుపై మండిపడ్డ రాహుల్ గాంధీ

**న్యూఢిల్లీ,ఆగస్ట్29 :** ఉత్తరాఖండ్ 'శుద్ధీకరణ' ఘటనను లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తప్పుబట్టారు. భారతీయ జనతాపార్టీ, ఆర్ఎస్ఎస్‌లపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. భారతదేశంలో అస్పృశ్యతను చట్టబద్ధంగా నిషేధించారని, మల్లికార్జున ఖర్గే దళితుడనే కారణంతో ఇలా మైదానాన్ని శుద్ధి చేయడం ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ చట్టం ప్రకారం తీవ్రమైన నేరమని రాహుల్ పేర్కొన్నారు. శనివారం ఢిల్లీలోని ఇందిరా భవన్‌లో నిర్వహించిన మీడియా ప్రతినిధుల సమావేశంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. 'శుద్ధీకరణ' సమాజంలో ఇంకా బతికే ఉన్న అంటరానితనానికి మరో పేరని ఆయన వ్యాఖ్యానించారు. శుద్ధీకరణ పూజను నిర్వహించిన వారిపై, దీనికి మద్దతు ఇచ్చిన ఉత్తరాఖండ్ స్థానిక బీజేపీ నేతలపై వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. దళితులు సమాజంలో ఎదగడం, గౌరవంగా బతకడం బీజేపీ, ఆర్ఎస్ఎస్‌కు ఇష్టం లేదని, ఈ ఘటన వారి కులవివక్ష భావజాలాన్ని స్పష్టం చేస్తోందని మండిపడ్డారు. ఆగస్టు 8వ తేదీన హల్ద్వానీలోని రాంలీలా మైదానంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పాల్గొన్నారు. ఖర్గే ర్యాలీ ముగిసిన రెండు రోజుల తర్వాత 'శ్రీరామ్ సేన' అనే స్థానిక సంస్థ ఆ మైదానంలో గంగాజలం చల్లి, హవనం (పూజ) నిర్వహించి మైదానాన్ని 'శుద్ధి' చేసింది. దీంతో వివాదం మొదలైంది.

# తెలంగాణ చెరువుల పునరుద్ధరణ అత్యావశ్యకం

### చిన్ననీటి పారుదల వ్యవస్థను బలోపేతం చేయాలి

### సిఎం రేవంత్ రెడ్డికి రైతు కమిషన్ నివేదిక

**హైదరాబాద్,ఆగస్ట్29 :** తెలంగాణలో చెరువుల పరిరక్షణ, చిన్న నీటిపారుదల వ్యవస్థ బలోపేతం దిశగా వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ కీలక సూచనలు చేసింది. చిన్న నీటిపారుదల వ్యవస్థను ప్రత్యేకంగా పునరుద్ధరించడంతో పాటు నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచే సాంకేతిక విభాగాలను ఏర్పాటు చేయాలని సూచించింది. చిన్న, పెద్ద నీటిపారుదల వనరులను సమన్వయం చేస్తూ కమాండ్ ఏరియా ఆధారిత నిర్వహణ వ్యవస్థను తీసుకురావాలని సిఫారసు చేసింది. చిన్న నీటిపారుదలపై రూపొందించిన నివేదికను కమిషన్ ప్రతినిధి బృందం శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సమర్పించింది. ఈ సందర్భంగా రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సభ్యులు రాములు నాయక్, రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, గంగాధర్, ఎం. భవానీరెడ్డి పాల్గొన్నారు. తెలంగాణలో నీటి భద్రత, వ్యవసాయ రంగ స్థిరీకరణ, గ్రామీణ జీవనోపాధుల అభివృద్ధికి చెరువుల పునరుద్ధరణ అత్యంత అవసరమని కమిషన్ తన నివేదికలో పేర్కొంది. చెరువుల పరిరక్షణ కోసం ప్రత్యేక చిన్న నీటిపారుదల చట్టాన్ని రూపొందించాలని సూచించింది. చెరువుల పూర్తి నీటి నిల్వ మట్టం సరిహద్దులను తక్షణమే గుర్తించి, ఆక్రమణలను తొలగించి శాశ్వతంగా పరిరక్షణ చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి సిఫారసు చేసింది. నీటిని మరింత సమర్థవంతంగా వినియోగించుకునేలా సాంకేతిక వ్యవస్థలను ఏర్పాటు చేయాలని, చిన్న చెరువులు, ఇతర చిన్న నీటి వనరులను పెద్ద నీటిపారుదల వ్యవస్థలతో అనుసంధానించే విధానాన్ని రూపొందించాలని కమిషన్ అభిప్రాయపడింది. ఈ సందర్భంగా గత రెండేళ్లలో కమిషన్ చేపట్టిన కార్యక్రమాలు, వివిధ అంశాలపై ప్రభుత్వానికి అందించిన సూచనలను కమిషన్ బృందం



ముఖ్యమంత్రికి వివరించింది. కమిషన్ పనితీరుపై సీఎం సంతృప్తి వ్యక్తం చేశారు. అదే సమయంలో వ్యవసాయ రంగంలో పంటల మార్పిడిపై మరింత దృష్టి పెట్టాలని, ఉద్యానవన పంటల సాగును పెంచాలని ముఖ్యమంత్రి సూచించారు. రైతుల ఉత్పత్తిదారుల సంఘాల ఏర్పాటుపైనా కమిషన్ ప్రత్యేకంగా పనిచేయాలని దిశానిర్దేశర చేశారు. చెరువుల పునరుద్ధరణతో పాటు వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చే అంశాలపై కూడా కమిషన్ మరింత దృష్టి సారించాలని సీఎం సూచించారు.

## కౌశిక్ రెడ్డి వ్యవహారంపై ఎథిక్స్ కమిటీ పరిశీలన

### వచ్చే సమావేశానికి కడియంను కూడా పిలవాలని నిర్ణయం

**హైదరాబాద్,ఆగస్ట్29 :** శాసనసభ ఎథిక్స్ కమిటీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అంశంపై చర్చ జరిగింది. ఛైర్మన్ రేవూరి ప్రకాశ్‌రెడ్డి అధ్యక్షతన ఎథిక్స్ కమిటీ శనివారం సమావేశమైంది. ఈ భేటీలో పలు పార్టీలకు చెందిన సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కౌశిక్‌రెడ్డిపై చేసిన అభియోగాలు తొలగించాలని బీఆర్ఎస్ సభ్యులు డిమాండ్ చేశారు. గత అసెంబ్లీ సమావేశాల్లో కడియం శ్రీహరిని ఉద్దేశించి చేయి చూపించి బెదిరించారని, అసభ్య పదజాలంతో దూషించారని కౌశిక్‌రెడ్డిపై కాంగ్రెస్ సభ్యులు రెండు అభియోగాలు మోపారు. వీడియోలో సైగలు తప్ప వాయిస్ లేదని, ఇతర సభ్యుల వ్యాఖ్యలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని బీఆర్ఎస్ డిమాండ్ చేసింది. వివరణ చెప్పుకోవడానికి కౌశిక్‌రెడ్డికి అవకాశం ఇవ్వాలని ఆ పార్టీ సభ్యులు కోరారు. మరోవైపు.. సభా హుందాతనాన్ని గౌరవించాలని కాంగ్రెస్ సభ్యులు పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కావొద్దంటే కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. కౌశిక్‌రెడ్డిపై అభియోగాలు వెనక్కి తీసుకోవాలని బీఆర్ఎస్, భాజపా సభ్యులు ప్రతిపాదించారు. ఎథిక్స్ కమిటీలో కూడా భాజపా, బీఆర్ఎస్ కలిసే పనిచేస్తున్నాయని కాంగ్రెస్ సభ్యులు ఆరోపించారు. వచ్చే



సమావేశానికి కౌశిక్‌రెడ్డి, కడియం శ్రీహరిని పిలవాలని ఎథిక్స్ కమిటీ నిర్ణయించింది.

## 92.86 లక్షల ఓట్ల తొలగింపుపై సమగ్ర పరిశీలన

(మొదటిపేజీ తరువాయి)

చదివి వినిపించాలన్నారు. నోటీసులకు సమాధానం ఇచ్చేందుకు 4 వారాల గడువు ఇవ్వాలన్నారు. పట్టణాల్లో పోలింగ్ కేంద్రాల వారీగా హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేయాలని, మండలస్థాయి అధికారులు ఇచ్చే డాక్యుమెంట్‌నూ ఆమోదించాలని సీఎం పేర్కొన్నారు. హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లో అదనపు ఈఆర్‌వోలను నియమించాలని కోరారు. ఓటర్ల నుంచి క్లెయిమ్స్, అభ్యంతరాలు స్వీకరించేందుకు ప్రస్తుతం ఉన్న గడువు సరిపోదని పేర్కొన్నారు. గడువును మరో నాలుగు వారాల పాటు పొడిగించాలని కోరారు. వలస కూలీలు, రోజువారీ కూలీలు.. తమ ఓటు హక్కు వివరాలను పరిశీలించుకునేందుకు, అవసరమైన పత్రాలను సమర్పించేందుకు అదనపు సమయం ఇవ్వాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్, మేడ్చల్-మల్కాజ్‌గిరి, రంగారెడ్డి జిల్లాల్లో అధిక సంఖ్యలో ఓటర్లు ఉన్నందున అదనపు సిబ్బంది అవసరమని సూచించారు. ఈ మూడు ప్రాంతాల్లో అదనపు ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్లను నియమించాలని కోరారు. ప్రక్రియను వికేంద్రీకరించాలని సీఈసీకి రాసిన లేఖలో రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## ధనిక రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిన బిఆర్ఎస్

(మొదటిపేజీ తరువాయి)

రుణాలు ఇచ్చామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మొదటి విడత ఇందిరమ్మ ఇళ్లు అందించామని తెలిపారు. సర్వే కోసం 70 రెవెన్యూ గ్రామాలను తీసుకున్నామని.. ఈ సర్వేతో దొంగ పట్టాలను గుర్తించవచ్చని చెప్పారు. రాబోయే సంవత్సరన్నర కాలంలో ప్రతి అంగుళం సర్వే చేస్తామన్నారు. పేదలకు ఇళ్లు ఇస్తే ప్రభుత్వంపై విషం చిమ్ముతున్నారని ప్రతిపక్షాలపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.

## ఘనంగా మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి వేడుకలు

### గచ్చిబౌలి హాకీ స్టేడియంలో ఘనంగా కార్యక్రమాలు..

### పాల్గొన్న మంత్రి వాకిటి శ్రీహరి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి



**హైదరాబాద్,ఆగస్ట్29 :** జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని భారత హాకీ దిగ్గజం, హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి వేడుకలను హైదరాబాద్‌లోని గచ్చిబౌలి హాకీ స్టేడియంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి, సోనిబాలదేవి, హాకీ అసోసియేషన్ అధ్యక్షులు కొండా విజయ్, క్రీడా శాఖ అధికారులు, హాకీ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేజర్ ధ్యాన్‌చంద్ విగ్రహానికి మంత్రి వాకిటి శ్రీహరి, చైర్మన్ శివసేన రెడ్డి, సోనిబాలదేవి, హాకీ అసోసియేషన్ అధ్యక్షులు కొండా విజయ్, అధికారులు, క్రీడాకారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం తెలంగాణ హాకీ లీగల్ ఫైనల్ మ్యాచ్‌ను ప్రారంభించారు. జాతీయ క్రీడా దినోత్సవ కార్యక్రమంలో మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ.. భారతీయ క్రీడాస్ఫూర్తిని ప్రపంచానికి చాటిన గొప్ప క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ అని కొనియాడారు. ధ్యాన్‌చంద్ తన అద్భుతమైన ఆటతీరు, క్రమశిక్షణ, ఏకాగ్రతతో భారత హాకీకి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తీసుకొచ్చారని అన్నారు. ఆయన జీవితం ప్రతి క్రీడాకారుడికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఆటలపై మక్కువ, ఏకాగ్రత, క్రమశిక్షణ ఉంటే విజయాన్ని సాధించవచ్చని మంత్రి అన్నారు. ప్రస్తుత తరం యువత సోషల్ మీడియా రీల్స్‌పై కాకుండా తమ భవిష్యత్తు కోసం క్రీడలపై దృష్టి సారించాలని సూచించారు. రీల్స్ కోసం కాకుండా.. రియల్ లైఫ్ కోసం ఆటలు ఆడండని మంత్రి యువ క్రీడాకారులకు పిలుపునిచ్చారు. మేజర్ ధ్యాన్‌చంద్ స్ఫూర్తితో తెలంగాణ క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి రాష్ట్రానికి, దేశానికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో? తెలంగాణను క్రీడారంగంలో దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా నిలిపేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి తెలిపారు. క్రీడాకారులకు మెరుగైన మౌలిక వసతులు, శిక్షణ, ప్రోత్సాహం అందిస్తూ తెలంగాణను స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు.



## గోల్ఫ్ టూరిజం హబ్‌గా తెలంగాణ

(మొదటిపేజీ తరువాయి)

జూపల్లి కృష్ణారావు ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టులకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. హైదరాబాద్ శివారు ప్రాంతమైన షామీర్‌పేట సమీపంలోని జవహర్‌నగర్‌లో దాదాపు 130 ఎకరాల విస్తీర్ణంలో ఒక భారీ గోల్ఫ్ కోర్సును నిర్మించనున్నారు. దేశ విదేశాల నుంచి వచ్చే క్రీడాకారులను, పర్యాటకులను ఆకట్టుకునేలా దీనిని అంతర్జాతీయ ప్రమాణాలతో రూపకల్పన చేయనున్నారు. దీంతోపాటు, ప్రకృతి అందాలకు నిలయమైన నాగర్‌కర్నూల్ జిల్లాలోని సోమశిల వద్ద మరో ప్రపంచస్థాయి గోల్ఫ్ కోర్సును అభివృద్ధి చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్‌షిప్ విధానంలో ఈ రెండింటిని నిర్మించి, పర్యాటకులకు ఉన్నత స్థాయి వసతులను కల్పించనున్నారు. భారీ ప్రాజెక్టులతో పాటు తెలంగాణ పర్యాటక , క్రీడారంగాలను ప్రపంచస్థాయిలో ప్రచారం చేసేందుకు ప్రముఖ భారతీయ క్రికెట్ దిగ్గజం, గోల్ఫ్ క్రీడాభిమాని కపిల్ దేవ్ సేవలను వినియోగించుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆయనకున్న ప్రపంచవ్యాప్త గుర్తింపు ద్వారా విదేశీ పర్యాటకులను, పెట్టుబడిదారులను తెలంగాణ వైపు ఆకర్షించడమే ఈ నిర్ణయం ముఖ్య ఉద్దేశం. ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రానికి కేవలం పర్యాటక ఆదాయం మాత్రమే కాకుండా, స్థానికంగా ఉన్న యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. విదేశీ పర్యాటకుల రాకతో హోటల్, రవాణా రంగాలకు కూడా మహర్దశ పడుతుంది. ప్రకృతి సౌందర్యం, ఆధునిక క్రీడా వసతుల మేళవింపుతో తెలంగాణను అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా మార్చడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ దిశగా వేగంగా అడుగులు వేస్తోంది.

# అక్కడికక్కడే సమస్యలను పరిష్కరించడమే ప్రజా పాలన లక్ష్యం

- నియోజకవర్గంలో పల్లెపల్లెకు కార్యక్రమం
- పలు గ్రామాల్లో పర్యటించిన మంత్రి పొన్నం
- గ్రామాల్లో సమస్యలపై నేరుగా తెలుసుకున్న మంత్రి
- అక్కడిక్కడే పలువురు అధికారులకు ఆదేశాలు



**సిద్దిపేట, ఆగస్ట్ 29 :** పల్లె పల్లెకు పొన్నం అన్న,పల్లె పల్లెలో ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా హుస్నాబాద్ నియోజకవర్గం ఎల్కతుర్తి మండలం దండేపల్లి గ్రామంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గ్రామ ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోవడంతో పాటు, సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించడం జరిగింది. ప్రజల సమస్యల పరిష్కారానికి అక్కడికక్కడే అధికారులకు ఆదేశాలు ఇవ్వడం జరిగింది. దండేపల్లికి నూతన గ్రామ పంచాయతీ భవనం, వీఓ భవనాలు, అంతర్గత సీసీ రోడ్లు, పలు ప్రధాన రహదారుల అభివృద్ధికి చర్యలు తీసుకోవడం జరిగింది. పెండింగ్‌లో ఉన్న కాలువ, మంచినీటి సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించడం జరిగింది. ఆరుతడి పంటలు, ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించాలని, నీటి సంరక్షణకు ప్రతి ఇంటా ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని సూచించడం జరిగింది. పాఠశాలలను బలోపేతం చేయడంతో పాటు యువత క్రీడల వైపు దృష్టి సారించేలా క్రీడా సదు-పాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. దండేపల్లిలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయనున్నాం. ÷-రజల సమస్యలను స్వయంగా విని, అధికారులతో అక్కడికక్కడే పరిష్కారానికి చర్యలు తీసుకోవడమే ప్రజా పాలన లక్ష్యం. దండేపల్లి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కట్టుబడి ఉన్నానని హామీ ఇచ్చారు. ఇకపోతే సూరారం గ్రామ అభివృద్ధికి ప్రాధాన్యత.. సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటానని అన్నారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం సూరారం గ్రామంలో 'ప్లలె ప్లలెకు పొన్నం అన్న - పల్లె పల్లెలో ప్రజా పాలన' కార్యక్రమంలో పాల్గొని ప్రజల సమస్యలను తెలుసు కోవడం జరిగింది. ప్రజల నుంచి వినతులు స్వీకరించి, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించడం జరిగింది. ప్రజా పాలనలో సూరారం గ్రామానికి 26 ఇందిరమ్మ ఇళ్లు, 475 పెన్షన్లు, 665 కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 158 కొత్త రేషన్ కార్డులు, రైతు రు-ణమాఫీ, రైతు భరోసా, కళ్యాణలక్ష్మి తదితర సంక్షేమ పథకాల ద్వారా లబ్ది చేకూరడం జరిగింది. సూరారం ప్రజల విజ్ఞప్తి మేరకు హుజురాబాద్-హనుమకొండ మధ్య సూరారం మీదుగా ఆర్టీసీ బస్సు నడిపించాలని అధికారులను ఆదేశించడం జరిగింది. సూరారం-పొలాడ్ పల్లి మధ్య బ్రిడ్జి, రోడ్లు, డ్రైనేజీ తదితర అభివృద్ధి పనులకు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడం జరిగింది. గ్రామంలో ఇప్పటికే సుమారు రూ.60 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగింది. మిగిలిన పనులను కూడా దశలవారీగా పూర్తి చేస్తాం. ల్గ÷తులు ఆరుతడి పంటలు, ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించాలని, ప్రజలు ఇంకుడు గుంతలు నిర్మించుకుని భూగర్భ జలాల పరిరక్షణకు సహకరించాలని సూచించడం జరిగింది. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు 1,200 స్టీల్ బ్యాంక్ కిట్లు అందించడం జరిగింది. యువత క్రీడల వైపు దృష్టి సారించేలా సూరారం గ్రామంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేస్తున్నాం. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు అందేలా ప్రక్రియ కొనసాగుతోంది. ఎలాంటి పైరవీలు అవసరం లేదని స్పష్టం చేయడం జరిగింది. అర్హత కలిగిన ఒక్క ఓటు కూడా ఓటర్ల జాబితా నుంచి తొలగిపోకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించడం జరిగింది. ఓటర్ల జాబితాలో తప్పులు ఉంటే వెంటనే సరిచేసుకోవాలని కోరడం జరిగింది. ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాను అని తెలియజేయడం జరిగింది.



## మెట్రో స్టేషన్లలో ఆన్‌లైన్ సమస్యలు

- ఎంట్రీ, ఎగ్జిట్ గేట్లు తెరుచుకోక ప్రయాణికుల ఇబ్బంది
- అంతా సర్దుకుందంటున్న మెట్రో అధికారులు

**హైదరాబాద్, ఆగస్ట్ 29 :** హైదరాబాద్ మెట్రో రైళ్లలో సాంకేతిక సమస్యలు తలెత్తాయంటూ వచ్చిన వార్తల నేపథ్యంలో మెట్రో అధికారులు స్పందించారు. మెట్రో రైలు సేవల్లో ఎలాంటి సాంకేతిక లోపం లేదని స్పష్టం చేశారు. ప్రస్తుతం నగరంలో మెట్రో రైలు సేవలు సాఫీగా కొనసాగుతున్నాయని వెల్లడించారు. నగరంలోని మెట్రో స్టేషన్లలోనూ ఎలాంటి సాంకేతిక ఇబ్బందులు లేవని చెప్పుకొచ్చారు. ప్రయాణికులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, మెట్రో సేవలు సాఫీగానే కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. అయితే ఎల్బీనగర్ మెట్రో స్టేషన్ వద్ద ఎంట్రీ, ఎగ్జిట్ గేట్లు ఆలస్యంగా ఓపెన్ అయ్యాయని అధికారులు తెలిపారు. స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ కారణంగానే గేట్లు తెరవడంలో కొంత ఆలస్యం జరిగిందని వివరించారు. ప్రస్తుతం ఎల్బీనగర్ సహా హైదరాబాద్‌లోని అన్ని మెట్రో స్టేషన్లలో సేవలు సాధారణ స్థితిలో కొనసాగుతున్నాయని ఎల్అండ్‌టీ మెట్రో అధికారులు వెల్లడించారు. అయితే ఆన్‌లైన్‌లో ముందుగానే టికెట్లు కొనుగోలు చేసుకున్న ప్రయాణికులు మెట్రో స్టేషన్ల వద్ద తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. టికెట్ తీసుకున్నప్పటికీ ఎంట్రీ, ఎగ్జిట్ గేట్ల వద్ద స్కానింగ్ సమస్యలు తలెత్తడంతో ప్రయాణికులు క్యూలలో నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆన్‌లైన్ సేవలు పనిచేయకపోవడంతో మెట్రో స్టేషన్ సిబ్బంది కూడా చేతులెత్తేసిన పరిస్థితి నెలకొంది. ఆన్‌లైన్ టికెట్ తీసుకున్న తర్వాతా గేట్ల వద్ద వేచి ఉండాల్సి రావడంతో ప్రయాణికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తరచుగా ఆన్‌లైన్ టికెటింగ్, స్కానింగ్ సేవల్లో అంతరాయాలు ఏర్పడుతుండటంపై మెట్రో ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను త్వరగా పరిష్కరించి ఆన్‌లైన్ టికెటింగ్, స్కానింగ్ సేవలను పునరుద్ధరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

## నీట్ పరీక్షకు ఒకరోజు ముందు విషాదం

**నీట్ పీజీ అభ్యర్థిని ఆత్మహత్య**

**హైదరాబాద్, ఆగస్ట్ 29 :** నీట్ పీజీ పరీక్షకు ఒకరో.జు ముందు నగరంలో విషాదం చోటుచేసుకుంది. నగరంలోని ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లో విషాద ఘటన జరిగింది. నీట్ పీజీ అభ్యర్థిని ఆత్మహత్య తీవ్ర కలకలం రేపుతోంది. ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని అపరాజిత హాస్టల్‌లో ఉంటూ నీట్ పీజీకి ప్రిపేర్ అవుతున్న యువతి విషం తాగి బలవన్మరణానికి పాల్పడింది. ఆదివారం నీట్ పీజీ పరీక్ష అనగా.. మనస్తాపంతో కర్నూలుకు చెందిన ఎంబీబీఎస్ విద్యార్థిని యశ్విత ప్రాణాలు తీసుకుంది. గత ఆరు నెలలుగా యువతి హైదరాబాద్‌లో ఉంటూ 'నీట్ పీజీ' పరీక్షకు ప్రిపేర్ అవుతోంది. మృతురాలు కర్నూలుకు చెందిన ప్రముఖ వ్యాపారి రామ్మోహన్ రెడ్డి ఏకైక కుమార్తె. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విద్యార్థిని మృతిపై కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఒక్కగానొక్క కూతురు మృతితో తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పరీక్షల మానసిక ఒత్తిడే యువతి ఆత్మహత్యకు కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు.

## సీజన్ వ్యాధుల పట్ల అప్రమత్తం కండి

**కేసులు పెరుగుతున్న జిల్లాలపై ప్రత్యేకదృష్టి**

**అధికారులతో సమీక్షలో మంత్రి దామోదర ఆదేశాలు**



**హైదరాబాద్, ఆగస్ట్ 29 :** సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, అజాగ్రత్తగా ఉంటే విజృంభిస్తాయని మంత్రి దామోదర్ రాజనర్సింహ హెచ్చరించారు. ఈ మేరకు ఆయన అధికారులో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. శనివారం రాష్ట్ర సచివాలయంలో జరిగిన ఈ సమావేశంలో రాష్ట్రంలో సీజన్ వ్యాధుల పరిస్థితిపై ఆరోగ్య శాఖ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. డెంగ్యూ, మలేరియా, చికన్‌గున్యా కేసులు తగ్గుముఖం పట్టాయన్నారు. గతేడాదితో పోలిస్తే డయేరియా, డిసెంట్రీ కేసులు కూడా తక్కువగా నమోదు అయినట్లు తెలిపారు. టైఫాయిడ్ కేసులు స్వల్పంగా పెరిగాయన్నారు. కేసులు పెరుగుతున్న జిల్లాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని మంత్రి ఆదేశించారు. ఫీవర్ సర్వేలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ప్రతి జ్వరం కేసును పర్యవేక్షించి.. అవసరమైన పరీక్షలు, చికిత్స అందించాలని మంత్రి తెలిపారు. ప్రభుత్వ హాస్పిటళ్లలో మందులు, టెస్టింగ్ కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఐఎల్ఐ, స్వైన్‌ఫ్లూ కేసులపై అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో ఐఎల్ఐ కేసులపై రోజువారీగా పర్యవేక్షించాలని రాజనర్సింహ తెలిపారు. అయితే, ప్రస్తుతం రాష్ట్రంలో సీజనల్ ఇన్‌ఫ్లూయెంజా పూర్తిగా నియంత్రణలోనే ఉందని మంత్రికి అధికారులు వివరించారు. దోమల నివారణ చర్యలను మరింత ముమ్మరం చేయాలని దామోదర రాజనర్సింహ ఆదేశాలు జారీ చేశారు. ప్రతి శుక్రవారం 'డ్రై డే' కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. నిల్వ నీటి తొలగింపు, లార్వా నిర్మూలన, ఫాగింగ్ కొనసాగించాలని సూచించారు. గ్రామాలు, పట్టణాలు, పాఠశాలలు, హాస్టళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రజారోగ్య పరిరక్షణెళి ప్రభుత్వ అత్యున్నత ప్రాధాన్యమని స్పష్టం చేశారు. వ్యాధులు వచ్చిన తర్వాత చికిత్స కంటే.. ముందస్తు నివారణెళి లక్ష్యమన్నారు. ప్రతి జిల్లాలో ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లు అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. సీజనల్ వ్యాధుల కేసులను ఏమాత్రం తేలికగా తీసుకోవద్దని మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాలు జారీ చేశారు.

## ముఖ్యమంత్రిని పనిచేసుకోనివ్వాలి

- కేబినేట్ పునర్వ్యవస్థీకరణతో కొత్తదనం తేవాలి
- మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు



**హైదరాబాద్, ఆగస్ట్ 29 :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి యువకుడు, ఉత్సాహవంతుడని అన్నారు. ముఖ్యమంత్రిని పని చేసుకోనివ్వాలని, ఆటంకాలు సృష్టించకూడదని చెప్పారు. కాంగ్రెస్ క్యాడర్‌లో అసంతృప్తి ఉందని.. కానీ, కాంగ్రెస్ పాలనపై సాధారణ ప్రజలు సంతృప్తికరంగానే ఉన్నారన్నారు. మీడియాతో చిట్ చాట్ నిర్వహించిన ఆయన కీలక విషయాలపై స్పందించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించిన పథకాలను కొనసాగిస్తూనే సీఎం రేవంత్ రెడ్డి కొత్త వాటిని అమలు చేస్తున్నా రని గుత్తా సుఖేందర్ రెడ్డి కొనియాడారు. ఈ సందర్భంగా మంత్రివర్గంపైనా కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం ఉన్న క్యాబినెట్‌ను పునర్వ్యవస్థీకరించాలని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు అయ్యిందని, క్యాబినెట్ పునర్వ్యవస్థీకరణ చేస్తే కొత్తదనం వస్తుందన్నారు. తెలంగాణలో ఏ రాజకీయ పార్టీలోనూ క్రమశిక్షణ లేదని, కాంగ్రెస్‌లో గ్రూపు తగాదాలు తగ్గించాలన్నారు. అదేవిధంగా పార్టీ లైన్ దాటిన వారిపై వేటు వేయకపోతే నష్టం జరుగుతుందన్నారు. పార్టీలో లీకేజీలను కంట్రోల్ చేయాలని, క్రమశిక్షణ ముఖ్యమని ఆయన చెప్పుకొచ్చారు. మరోవైపు, నాలుగు పంటలకూ రైతు భరోసా అందించాలని శాసన మండలి ఛైర్మన్ విజ్ఞప్తి చేశారు. రిజిస్ట్రేషన్ చట్టం-1908లోని సెక్షన్ 22-ఏని రద్దు చేయాలని సూచించారు. ప్రజలకు ఉచిత పథకాలను తగ్గించాలని, నిజమైన లబ్ధిదారులకే వాటిని అందించాలన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారులను నిర్లక్ష్యం చేయొద్దని, వారికి న్యాయం చేయాలని శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సూచించారు.

## ప్రోటోకాల్ ఉల్లంఘనపై దానం ఆగ్రహం

**అధికారుల తీరుపై మండిపాటు**

**హైదరాబాద్, ఆగస్ట్ 29 :** ఖైరతాబాద్ డబుల్ బెడ్ రూంల లక్కీ డ్రాలో ప్రోటోకాల్ రగడ నెలకొంది. ప్రోటోకాల్ పాటించకపోవడంపై ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం బంజారాహిల్స్ కొమరం భీమ్ ఆదివాసీ భవన్‌లో ఖైరతాబాద్ గృహలక్ష్మి లబ్దిదారుల ఎంపిక కోసం లక్కీ డ్రా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే దానం నాగేందర్ ఈ కార్యక్రమంలో పాల్గొని లక్కీ డ్రా ద్వారా లబ్దిదాలను ఎంపిక చేయాల్సి ఉంది. అయితే ఎమ్మెల్యే రాకముందే అధికారులు లక్కీ డ్రాను ప్రారంభించారు. దీనిపై దానం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను వచ్చేలోపే గృహలక్ష్మి లక్కీ డ్రా ప్రారంభించడంపై దానం నాగేందర్ మండిపడ్డారు. ఎమ్మెల్యే వచ్చే వరకు ఆగకుండా డ్రా ఎలా ప్రారంభిస్తారని అధికారులపై సీరియస్ అయ్యారు. ప్రోటోకాల్ ఉల్లంఘించిన అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధికారుల తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన దానం నాగేందర్.. కార్యక్రమం మధ్యలోనే అలిగి వెళ్లిపోయారు. కాగా.. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఎ÷-లాట్ల లక్కీ డ్రా హైదరాబాద్ క్యూర్ పరిధిలో కొనసాగుతోంది. కోర్ అర్బన్ ప్రాంతంలోని తొలి విడతలో నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఈ ఇళ్ల కేటాయింపు ప్రక్రియ పారదర్శకంగా జరగనుంది. నాలుగు రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.



## ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు

**స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలో మహమ్మద్ అలీ షబ్బీర్, ఎంపీ సురేష్ కుమార్ షట్కర్**

**కామారెడ్డి, ఆగస్టు 29 :** అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్. స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం సందర్భంగా ఎంపీ సురేష్ కుమార్ షట్కర్ తో కలసి పాల్గొన్నారు. కామారెడ్డి నియోజకవర్గం బిక్నూర్ మండలం రామేశ్వరం పల్లి గ్రామంలో నూతనంగా మంజూరైన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూ...కాంగ్రెస్ ప్రభుత్వం పేదలు, బలహీన వర్గాల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. ఈ రేషన్ కార్డుల ద్వారా ప్రజలకు నిత్యావసర సరుకులు సులభంగా అందడంతో పాటు, ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలకు అర్హత పొందే అవకాశం కలుగుతుంది అని తెలిపారు.ప్రజల అవసరాలను గుర్తించి కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు సంక్షేమ కార్యక్రమాలు, మహిళా సాధికారత పథకాలు, యువతకు ఉపాధి అవకాశాలు వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోంది. పేదల ముఖంలో చిరునవ్వు చూడడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం అని పేర్కొన్నారు. మరో ముఖ్య అతిధి జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షట్కర్ మాట్లాడుతూ.ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు చేరేలా ప్రభుత్వం పారదర్శకంగా పనిచేస్తోంది. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా పేద కుటుంబాలకు మరింత మెరుగైన సేవలు అందనున్నాయి అని అన్నారు.

## ఎంఐఎం ఎమ్మెల్సీ రహ్మత్ సస్పెన్షన్

**ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయాలని పార్టీ ఆదేశం**

**హైదరాబాద్, ఆగస్ట్ 29 :** ఎంఐఎం ఎమ్మెల్సీ మిర్జా రహ్మత్ బేగ్‌పై పార్టీ అధిష్ఠానం కీలక నిర్ణయం తీసుకుంది. ఆయన పార్టీ సభ్యత్వాన్ని తక్షణమే రద్దు చేసినట్లు పార్టీ జాయింట్ సెక్రటరీ ఎస్ఏ హుస్సేన్ అన్వర్ ఎక్స్ వేదికగా వెల్లడించారు. మిర్జా రహ్మత్ బేగ్ తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా పత్రాన్ని వెంటనే శాసన మండలి చైర్మన్‌కు సమర్పించాలని ఆదేశించారు. నాలుగు రోజుల క్రితం అత్తాపూర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో మహిళలతో అసభ్యంగా ప్రవర్తించారని రహ్మత్ బేగ్‌పై ఆరోపణలు వచ్చాయి. అయితే.. ఈ ఆరోపణలే పార్టీ నిర్ణయానికి కారణమని ఎంఐఎం అధికారికంగా వెల్లడించలేదు. ప్రస్తుతం ఆయనపై పార్టీ తీసుకున్న చర్య రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

## ఇద్దరిని బలిగొన్న వేపచెట్టు వివాదం

**గొడ్డళ్లతో నరుకున్న ఇరువర్గాలు**

సూర్యాపేట, ఆగస్ట్ 29 : సూర్యాపేటజిల్లాలో ఓ చిన్న వివాదం పెద్దదిగా మారి ఇద్దరి ప్రాణాలను బలి తీసుకున్నది. మేళ్లచెరువు మండలం ఎర్రగడ్డతండాలో ఇంటి పక్కన ఉన్న వేపచెట్టు విషయ-ంమై రెండు వర్గాల మధ్య చిచ్చు రేగింది. దారుణమైన రక్తపాతానికి దారితీసింది. మాటామాటా పెరిగి తీవ్ర ఆగ్రహంతో ఊగిపోయిన ఇరు వర్గాలు విచక్షణ కోల్పోయి ఏకంగా గొడ్డళ్లతో పరస్పరం దాడులకు తెగబడటం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఈ దాడిలో ఒకరిపై ఒకరు వేసుకున్న గొడ్డలి వేట్లకు ఇద్దరు వ్యక్తులు రక్తపు మడుగులో కుప్పకూలి అక్కడికక్కడే ప్రాణాలు వదిలారు. ఆ ఇద్దరు వ్యక్తులు ఘర్షణను అడ్డుకునేందుకు రంగంలోకి దిగిన మేళ్లచెరువు ఎస్ఐ నవీన్‌కుమార్‌కు సైతం తీవ్ర గాయాలయ్యాయి. ఓ చిన్న చెట్టు వివాదం ఇద్దరి ప్రాణాలు తీయడంతోపాటు పోలీసులకే గాయాలయ్యే స్థాయికి వెళ్లడంతో ఎర్రగడ్డతండాలో ప్రస్తుతం తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

## ఘనంగా రామేశ్వరం పల్లి పీఎసిఎస్ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం

**యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి రూ.200 కోట్లు మంజూరు**

**బిక్కనూర్, ఆగస్టు 29 :** రామేశ్వరం పల్లి పీఎసిఎస్ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్, జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ షట్కర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్‌గా బద్దం ఇంద్రకరణ్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేయగా, పాలకవర్గ సభ్యులు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం నూతన చైర్మన్, పాలకవర్గ సభ్యులను నాయకులు అభినందించారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి రూ.200 కోట్లు మంజూరు అయినట్లు షబ్బీర్ అలీ ప్రకటించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రైతు బలపడితేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పటిష్టంగా మారుతుందని పేర్కొన్నారు. జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ షట్కర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందన్నారు. రైతుల జీవితాల్లో మార్పు తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోంది. కొంత ఆలస్యం కావచ్చు కానీ ప్రజలకు ఇచ్చిన మాటను తప్పకుండా నిలబెట్టుకుంటుంది అని అన్నారు.గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందని విమర్శించారు. 16 వేల కోట్ల మిగులు బడ్జెట్‌తో ఉన్న తెలంగాణను దాదాపు రూ.8 లక్షల కోట్ల అప్పుల భారంలోకి తీసుకెళ్లారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్థిక పరిస్థితులను చక్కదిద్దుకుంటూ ప్రజా సంక్షేమ పాలన అందిస్తోంది" అని పేర్కొన్నారు.

# నేపాల్‌లో సవాల్‌గా సహాయక చర్యలు!



**నేపాల్‌ను అతలాకుతలం చేసిన భారీ ఆకస్మిక వరదలు తీవ్ర విషాదాన్ని మిగిల్చాయి. ఇప్పుడా చిన్న దేశం కోలుకోవడానికి సవత్సరాలు పట్టవచ్చు. ఊళ్లకు ఊళ్లు ధ్వంసం కావడంతో మళ్లీ పునర్నిర్మాణం అతిపెద్ద సమస్యగా మారింది. కేవలం టూరిజం ప్రధాన వనరుగా ఉన్న నేపాల్ ఆర్థికంగా పెద్దగా బలపడడ్ దేశం కాదు. మౌళిక వసతులు అంతంత మాత్రమే. ఈ క్రమంలో తొలుతు బురద తొలగింపు, గల్లంతయిన వారి గుర్తింపు ప్రధాన సమస్యగా మారింది. వరదల కారణంగా మృతుల సంఖ్య 600 దాటగా, మరో 2,500 మందికి పైగా ఆచూకీ లేకుండా పోయారు. దీంతో సహాయక చర్యలకు మరో పెద్ద సమస్య ఎదురైంది. వరదల్లో మరణించిన వారి మృతదేహాలను భద్రపరిచేందుకు దేశంలోని మార్చురీల్లో సరిపడా స్థలం లేకపోవడంతో అధికారులు తాత్కాలిక ఏర్పాట్లు చేస్తున్నారు.**

భారత్, చైనా మధ్య ఉన్న భూపరివేష్టిత దేశమైన నేపాల్‌లోని మార్చురీలన్నింటి కలిపి సామర్థ్యం సుమారు 350 మృతదేహాలు మాత్రమే. అయితే మృతుల సంఖ్య ఇప్పటికే 600 దాటడంతో ఆసుపత్రులు, మార్చురీలు మృతదేహాలను భద్రపరచడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. వరదల తర్వాత కూడా 2,500 మందికి పైగా గల్లంతైనవారు ఉండటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. గల్లంతైన వారి కుటుంబ సభ్యులు వచ్చి తమ బంధువులను గుర్తించే వరకు మృతదేహాలను భద్రపరిచేందుకు ప్రభుత్వం తాత్కాలిక కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది. నేపాల్ పోలీస్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, సహాయక బృందాలు మృతదేహాలను వెలికితీసిన వెంటనే వాటి క్లోజ్‌అప్ ఫొటోలను తీస్తున్నారు. మృతదేహం స్పష్టంగా కనిపించకపోతే ముందుగా శుభ్రం చేసి, అనంతరం బాడీ బ్యాగ్‌కు ప్రత్యేక గుర్తింపు ట్యాగ్‌ను అమర్చుతున్నారు. ఆ తర్వాత వాటిని తాత్కాలిక భద్రపరిచే కేంద్రాలకు తరలిస్తున్నారు. ఈ తాత్కాలిక కేంద్రాల్లో ఉష్ణోగ్రతను సుమారు 0 డిగ్రీల వద్ద ఉంచేలా ఏర్పాట్లు చేస్తున్నారు. గల్లంతైన వారి బంధువులు సమాచారం కోసం వచ్చినప్పుడు, ఇప్పటివరకు వెలికితీసిన మృతదేహాల ఫొటోలను వారికి చూపిస్తున్నారు. కుటుంబ సభ్యులు తమ బంధువును గుర్తిస్తే, అవసరమైన అధికారిక పక్రియలను పూర్తి చేసిన అనంతరం మృతదేహాన్ని వారికి అప్పగిస్తున్నారు. మృతదేహాల గుర్తింపులో ఇబ్బందులు ఎదురవుతున్న కారణంగానే ఈ విధానాన్ని అనుసరిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఫింగర్ ప్రింట్, డిఎన్ఎ నమూనాల సేకరణ ముఖం ద్వారా గుర్తింపు సాధ్యం కాని మృతదేహాల విషయంలో పోలీసులు ఇప్పుడు వేలిముద్రలు, ఇతర నమూనాలను సేకరిస్తున్నారు.

బంధువులు వెంటనే గుర్తించలేని పరిస్థితుల్లో కూడా భవిష్యత్తులో శాస్త్రీయ పద్ధతుల ద్వారా మృతదేహాల ను గుర్తించేందుకు ఈ నమూనాలు ఉపయోగ పడతాయి. బంధువులు లభించకపోయినా లేదా మృతదేహాన్ని గుర్తించలేకపోయినా వాటిని నిరవధికంగా నిల్వ ఉంచడం సాధ్యం కాదు. అందుకే ముందుగానే వేలిముద్రలు, డిఎన్ఎ నమూనాలు సేకరించి, మార్గదర్శకాల ప్రకారం స్థానిక అధికారుల సహకారంతో మృతదేహాలను ట్యాగ్‌లతో నిర్దేశిత ప్రదేశాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మృతదేహాల నిర్వహణ కోసం నేపాల్‌లో 2021 ప్రత్యేక చట్టం అమల్లో ఉన్నాయి. జిల్లా పోలీస్ చీఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటైన కమిటీలు గుర్తు తెలియని, బంధువులు ఎవరూ కలెయిమ్ చేయని మృతదేహాలను నిర్వహిస్తాయి. అయితే ప్రస్తుతం వరుసగా మృతదేహాలు వస్తుండటంతో పరిస్థితి మరింత క్లిష్టంగా మారిందని అధికారులు చెబుతున్నారు. దీంతో జిల్లా స్థాయి కమిటీలు కేంద్ర ప్రభుత్వ అధికారులతో సమన్వయం చేసుకుంటున్నాయి. వరదల్లో గల్లంతైన 2,500 మందికి పైగా వ్యక్తుల కోసం సహాయక బృందాలు తీవ్రంగా గాలిస్తున్నాయి. ప్రస్తుతం అధికారికంగా మృతుల సంఖ్య 616కి చేరినట్లు సమాచారం. సహాయక చర్యలు కొనసాగుతున్న కొద్దీ మరిన్ని మృతదేహాలు వెలికితీయడంతో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. పరిస్థితి తీవ్రంగా మారడంతో నేపాల్ విదేశీ సహాయాన్ని స్వీకరించేందుకు అంగీకరించింది. ముఖ్యంగా భారత్, చైనాకు చెందిన సెర్చ్ అండ్ రెస్క్యూ బృందాలు స్థానిక అధికారులకు సహాయం చేసేందుకు అనుమతిస్తున్నారు.

అంతర్జాతీయ సమాజం నుంచి వచ్చిన ఒత్తిడి, గల్లంతైన విదేశీ పౌరుల కుటుం బాల ఆందోళనల నేపథ్యంలో పరిమిత సంఖ్యలో నిపుణులను, సెర్చ్ అండ్ రెస్క్యూ బృందాలను నిర్దిష్ట ప్రాంతాల్లోకి అనుమతిస్తున్నట్లు నేపాల్ ప్రభుత్వం తెలిపింది. భారీ వరదల కారణంగా ప్రాణనష్టం మాత్రమే కాకుండా, మృతదేహాల గుర్తింపు, భద్రపరచడం, కుటుంబ సభ్యులకు అప్పగించడం వంటి పక్రియలు కూడా అధికారులకు పెద్ద సవాలుగా మారాయి. 600కు పైగా మరణాలు, 2,500 మందికి పైగా గల్లంతు, మార్చురీల పరిమిత సామర్థ్యం నేపాల్‌లో పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో తెలియజేస్తున్నాయి. సహాయక చర్యలు కొనసాగుతున్న నేపథ్యంలో మృతుల గుర్తింపు, కుటుంబాల పునరేకీకరణ ఇప్పుడు అధికారులకు అత్యంత కీలకమైన పనిగా మారింది.

# నేపాల్‌లో మృత్యుంజయులు

**చనిపోయారనుకున్న ఇద్దరు తనయులు రాక**
**కన్నీటి పర్యంత నుంచి తేరుకున్న తల్లి ఆనందబాష్పాలు**



**ఖాట్మండ్, ఆగస్ట్ 29 :** నేపాల్‌లో ఇటీవల సంభవించిన భారీ వరదలకు 616 మంది మృతి చెందగా, సుమారు 2,500 మంది గల్లంతయ్యారు. ఎంతో మంది నిరాశ్రయులయ్యారు. ఎన్నో కుటుంబాలు తమ వారిని కోల్పోయి కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నాయి. ఇదే సమయంలో ఓ తల్లి తన ఇద్దరు కుమారులు చనిపోయారని భావించి గుండెలు పగిలేలా రోదించింది. రెండు రోజుల తర్వాత వారిద్దరూ ప్రాణాలతోనే ఉన్నారని తెలుసుకుని ఊపిరి పీల్చుకుంది. ఈ ఘటనకు సంబంధించిన వార్త ఇప్పుడు పలువురిని కంటతడి పెట్టిస్తోంది. రాసువా జిల్లాకు చెందిన మట్టి మాయా తమాంగ్ (28) అనే మహిళకు ఇద్దరు కుమారులు ఉన్నారు. వారిలో పెద్దవాడు జోయల్ ఘలే (8). బుధవారం ఉదయం వారిద్దరూ పాఠశాలకు వెళ్లగా.. కొద్దిసేపటికే భారీ శబ్దం వినిపించడంతో ఇంటి నుంచి బయటకు వచ్చిన తమాంగ్‌కు భయానక దృశ్యం కనిపించింది. వరద నీరు, బురద, రాళ్లు భారీగా ప్రవహిస్తూ ఆ ప్రాంతాన్ని ముంచెత్తాయి. ఇదే క్రమంలో పాఠశాల భవనాన్నీ వరద నీరు ధ్వంసం చేసింది. పిల్లలు వరదల్లో కొట్టుకుపోయి ఉంటారని భావించిన తమాంగ్.. వారిని వెతుక్కుంటూ పలు సహాయక శిబిరాలు తిరిగింది. అయినా వారి ఆచూకీ మాత్రం ఎక్కడా దొరకలేదు. దీంతో కుమారులిద్దరూ చనిపోయారని భావించి గుండెలు పగిలేలా రోదించింది. అయితే చిన్నారి జోయల్ ప్రాణాలతో బయటపడ్డాడు. వరద సమయంలో ఓ స్నేహితుడితో కలిసి పాఠశాల నుంచి అడవిలోకి పారిపోయాడు. వరద నీటి నుంచి తప్పించుకునేందుకు చెట్టు ఎక్కాడు. ఈ క్రమంలో అతని కాలు విరిగి తీవ్రంగా గాయపడ్డాడు. చేతులు, ముఖానికీ గాయాలయ్యాయి. గురువారం నాడు బాలుడిని గుర్తించిన పోలీసులు.. నువాకోట్ జిల్లాలోని 15 పడకల చక్ర దేవ్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఖాఠ్మాండూ ఆస్పత్రికి తరలించారు. అయితే, ఓ జర్నలిస్టు సహాయంతో జోయల్ ఆచూకీని తమాంగ్ గుర్తించింది. వెంటనే ఆస్పత్రికి చేరుకుని కుమారుడిని కలుసుకుంది. జోయల్‌ను చూసే వరకూ అతను బతికే ఉన్నాడన్న విషయాన్ని తమాంగ్ నమ్మలేకపోయింది. ఒక్కసారిగా కుమారుడిని చూసి కన్నీరుమున్నీరుగా విలపించింది. అప్పటికే చిన్న కుమారుడు కూడా దొరకడంతో కథ సుఖాంతమైంది. 8 ఏళ్ల బాలుడు చెట్టు ఎక్కి వరదల నుంచి తప్పించుకొని సురక్షితంగా బయటపడ్డాడు. ఎట్టకేలకు రెండు రోజుల తర్వాత తన తల్లిని తిరిగి కలుసుకోగలిగాడు. నేపాల్‌కు చెందిన జోయల్ ఘలే, అతడి సోదరుడు బుధవారం పాఠశాలకు వెళ్లారు. ధాడింగ్ జిల్లాల్లో వరదల ధాటికి పలు స్కూళ్లు కొట్టుకుపోయాయి. స్థానికంగా ఉన్న ఓ చెట్టును పట్టుకొని జోయల్ ఘలే ప్రాణాలు కాపాడుకున్నాడు. ఒళ్లంతా గాయాలతో రోజంతా చెట్టుపైనే ఉండి సహాయం కోసం ఎదురు చూశాడు. అతడిని రక్షించిన సహాయక బృందాలు వైద్యం కోసం ఆస్పత్రిలో చేర్చాయి. తన ఇద్దరు కుమారుల కోసం అనేక శిబిరాల్లో వెతికినా ఎక్కడా వారి ఆచూకీ దొరక్కపోవడంతో ఆశలు వదులు కున్నానని బాలుడి తల్లి మాయా తమాంగ్ పేర్కొన్నారు. తన కుమారుడు బతికే ఉన్నట్లు అధికారుల నుంచి సమాచారం అందడంతో నమ్మలేక పోయానన్నారు. అనంతరం మరో కుమారుడిని కూడా స్థానిక అధికారులు రక్షించినట్లు తమకు సమాచారం అందిందని సంతోషం వ్యక్తం చేశారు. తమ పిల్లలను కాపాడిన అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# నేపాల్ వరదల్లో మరో విషాదం

- ఆచూకీ లేని ఇన్ఫోసిస్ పబ్లిక్ సర్వీసెస్ సిఇవో
- లక్ష్మీనాథ్ గోపిశెట్టి ఆచూకీ కోసం ముమ్మర గాలింపు



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 29 :** నేపాల్‌లో బీభత్సం సృష్టించిన ఆకస్మిక వరదల్లో ఇన్ఫోసిస్ పబ్లిక్ సర్వీసెస్ సీఈఓ లక్ష్మీనాథ్ గోపిశెట్టి ఆచూకీ గల్లంతైంది. ఆయన వ్యక్తిగత పర్యటన నిమిత్తం నేపాల్‌కు వెళ్లినట్లు ఇన్ఫోసిస్ వెల్లడించింది. ప్రస్తుతం ఆయనతో సంబంధాలు తెగిపోయాయని, ఆచూకీ కోసం సంబంధిత అధికారులతో కలిసి గాలిస్తున్నామని తెలిపింది. గోపిశెట్టి కుటుంబ సభ్యులతో సంస్థ సంప్రదింపులు జరుపుతూ, వారికి అవసరమైన సాయాన్ని అందిస్తున్నట్లు పేర్కొంది. కాగా.. నేపాల్–చైనా సరిహద్దు ప్రాంతంలో ఈ నెల 26న సంభవించిన జల ప్రళయంలో పలు రహదారులు, వంతెనలు, భవనాలు కొట్టుకుపోయాయి. ముఖ్యంగా నేపాల్‌లోని రసువా జిల్లా, చైనాలోని టిబెట్ ప్రాంతాల్లో భారీ నష్టం వాటిల్లింది. సహాయక చర్యలకు ప్రతికూల వాతావరణం, దెబ్బతిన్న రవాణా, సమాచార వ్యవస్థలు సవాలుగా మారాయి. ఈ విపత్తు కారణంగా వందలాది మంది భారతీయుల ఆచూకీ గల్లంతైనట్లు భారత విదేశాంగ శాఖ తెలిపింది. సుమారు 320 మంది భారతీయులు ఇంకా అందుబాటులోకి రాలేదని వెల్లడించింది. అటు చైనాలో సుమారు 400 మంది భారతీయులు చిక్కుకున్నప్పటికీ సురక్షితంగా ఉన్నారంది. ఆయా కుటుంబ సభ్యులు వారితో కాంటాక్ట్‌లో ఉన్నారని తెలిపింది. చైనా వైపు చిక్కుకున్న వారిలో కొంతమంది ఇప్పటికే నేపాల్‌కు చేరుకున్నారు. తమిళనాడుకు చెందిన 21 మంది భారతీయులు కూడా సురక్షితంగా ఢిల్లీ చేరుకున్నారు. నేపాల్‌లో సహాయక చర్యలు కొనసాగుతుండగా, గల్లంతైన భారతీయుల ఆచూకీ కోసం భారత దౌత్య అధికారులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. గోపిశెట్టి ఇన్ఫోసిస్ పబ్లిక్ సర్వీసెస్‌కు నాయకత్వం వహిస్తూ ప్రభుత్వ రంగ సంస్థలకు వ్యూహరచన, సాంకేతికత, కార్యకలాపాలు, డిజిటల్ పరివర్తనలో సలహాదారుడిగా వ్యవహరిస్తున్నారు. గతంలో ఇన్ఫోసిస్‌లో గ్లోబల్ వైస్ ప్రెసిడెంట్‌గా, యాక్సెంచర్‌లో మేనేజింగ్ డైరెక్టర్‌గా పనిచేశారు.

## సహాయక చర్యలపై సందిగ్ధత

**ఎట్టకేలకు విదేశీ నిపుణల రాకకు నేపాల్ అంగీకారం**

**ఖాఠ్మండ్, ఆగస్ట్ 29 :** జలప్రళయ ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలకు సహకరిస్తామంటూ పలు దేశాలు ముందుకురాగా.. నేపాల్ ఆ అభ్యర్థనలను తొలుత తిరస్కరించింది. ఇప్పుడు తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. విదేశీ సహాయక బృందాలను దేశంలోకి అనుమతించేందుకు అంగీకరించింది. తమ బృందాలు సహాయక చర్యలు నిర్వహించగలవని, విదేశీ బృందాలను అనుమతించబోమని ఇటీవల నేపాల్ వెల్లడించింది. అయితే గల్లంతయిన వారిలో పలు దేశాల ప్రజలు ఉన్నారు. దాంతో సహాయక చర్యల్లో భాగం అవుతామని ఆయా దేశాల నుంచి వచ్చిన దౌత్యపరమైన ఒత్తిడి కారణంగా చివరకు నేపాల్ ప్రభుత్వం వెనక్కి తగ్గాల్సి వచ్చింది. సొరంగాల్లో రక్షణ చర్యలు చేపట్టగల సిబ్బంది, డీఎన్ఏ టెస్టింగ్, ఫోరెన్సిక్ పరీక్షలు చేయగల అంతర్జాతీయ బృందాలనే అనుమతించాలని భావిస్తోంది. నిర్దిష్ట విభాగాల్లో.. పరిమిత సంఖ్యలోనే రెస్క్యూటీమ్స్‌కు అనుమతి తెలపనున్నట్లు ప్రభుత్వ అధికారి ఒకరు మీడియాకు వెల్లడించారు. పొరుగుదేశం నేపాల్‌కు భారత్ నుంచి అత్యవసర సహాయం అందుతోంది. తాజాగా 10 టన్నుల సామగ్రితో మూడో విమానం ఆ దేశంలో ల్యాండ్ అయింది. అలాగే 11 మంది బృందం కూడా వెళ్లింది. వారిలో వైద్యులు, సొరంగాల వద్ద సహాయక చర్యలు నిర్వహించగల సిబ్బంది, ఇతరులు ఉన్నారు. ఇక నేపాల్ వరదల్లో చిక్కుకున్న 84 మంది భారతీయుల్ని కాపాడారు. వారిలో తమిళనాడు రాష్ట్రానికి చెందిన 21 మంది భారత్‌కు చేరుకున్నారు. 320 మంది ఆచూకీ ఇప్పటికీ లభించలేదని భారత ప్రభుత్వం వెల్లడించింది. ఇక ఈ విలయంలో మృతుల సంఖ్య 616కి చేరింది. 2400 మందికిపైగా గల్లంతయ్యారని నేపాల్ పోలీసులు వెల్లడించారు.

## ప్రాణాలు కాపాడి అమరుడైన పోలీస్

**చైనా బోర్డర్ పోలీస్ హువాంగ్ పెంగ్ సాహసం**

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 29 :** నేపాల్–చైనా సరిహద్దులో బుధవారం సంభవించిన మెరుపు వరదలు పెను విధ్వంసం సృష్టించాయి. ఈ విపత్తు నుంచి పలువురిని రక్షించిన ఓ పోలీసు.. చివరికి ఆ వరదల్లోనే కొట్టుకుపోయారు. ఇందుకు సంబంధించిన వీడియో తాజాగా వెలుగులోకి వచ్చింది. వరద బీభత్స సమయంలో టిబెట్‌లోని గీరాంగ్ పోర్టు వద్ద సహాయక చర్యల్లో చైనా బోర్డర్ పోలీసు హువాంగ్ పెంగ్ పాల్గొన్నాడు. అక్కడి నుంచి సురక్షిత ప్రాంతాలకు వెళ్లేందుకు పలువురికి సహకరించాడు. ఆ తర్వాత అదే జలప్రళయంలో కొట్టుకుపోయాడు. గీరాంగ్ పోర్టు వద్ద వరద దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. వరదకు ముందు అక్కడి నుంచి తాము సురక్షితంగా బయటపడడానికి బోర్డర్ కాప్ సహాయం చేశారని.. తమను కాపాడి, ఆయన ప్రాణాలు వదిలారని పలువురు వ్యక్తులు సోషల్ మీడియాలో పేర్కొన్నారు. ఆయనను ఓ హీరోలా అభివర్ణించారు. వీడియో ఆధారంగా అతడిని గీరాంగ్ పోర్టులో విధులు నిర్వహిస్తున్న చైనా ఇమిగ్రేషన్ పోలీసు అధికారి హువాంగ్‌గా గుర్తించారు. వరద ప్రవాహం తనను సమీపించినప్పటికీ.. ఇతరుల ప్రాణాలు కాపాడడానికి ఆయన చివరి నిమిషం వరకు కృషి చేశారని చైనా స్థానిక పత్రికలు వెల్లడించాయి. ఘటన జరిగి రెండు రోజులు కావస్తున్నా ఇప్పటికీ అతడి ఆచూకీ లభించలేదు.

## నేపాల్ వరదలపై మల్లికార్జున ఖర్గే ఆందోళన

**తక్షణ సాయం అందించాలని మోడీకి లేఖ**

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 29 :** నేపాల్‌లో సంభవించిన విధ్వంసకర వరదలపై కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాకు ఆయన లేఖ రాశారు. నేపాల్‌లో భారీ వరదల కారణంగా పెద్ద ఎత్తున ప్రాణ, ఆస్తి నష్టం సంభవించిందని ఖర్గే పేర్కొన్నారు. వరదల కారణంగా 500 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా, దాదాపు 1,000 మందికి పైగా గల్లంతైనట్లు ఖర్గే తన లేఖలో తెలిపారు. వేలాది మంది ప్రజలు ఆహారం, మందులు, నివాసం, ఇతర అత్యవసర సదుపాయాల కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విపత్కర పరిస్థితుల్లో భారత ప్రభుత్వం నేపాల్ ప్రభుత్వంతో సమన్వయం చేసుకుని బాధితులకు అవసరమైన మానవతా, సహాయక చర్యలను అందించాలని ఖర్గే కోరారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలను వేగవంతం చేసి, బాధితులకు అవసరమైన ఆహారం, మందులు, నివాసం వంటి అత్యవసర సదుపాయాలు అందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా వరదల కారణంగా నేపాల్‌లోని వివిధ ప్రాంతాల్లో భారతీయులు, భారతీయ మూలాలున్న వ్యక్తులు కూడా చిక్కుకుపోయారని ఖర్గే తెలిపారు. వారిని గుర్తించి సురక్షితంగా భారత్‌కు తరలించేందుకు రెస్క్యూ, తరలింపు చర్యలను ముమ్మరం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. నేపాల్‌లో నెలకొన్న విపత్కర పరిస్థితుల్లో భారత ప్రభుత్వం వేగంగా స్పందించి సహాయక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని ఖర్గే తన లేఖ ద్వారా స్పష్టం చేశారు. బాధిత ప్రజలకు మానవతా దృక్పథంతో అవసరమైన అన్ని రకాల సహాయాన్ని అందించాలని కేంద్రాన్ని కోరారు.

## 'రాష్ట్రీయ పోషన్ మాహ్' మాసోత్సవం

**ఏలూరు, ఆగష్టు, 29 :** జిల్లాలో 'రాష్ట్రీయ పోషన్ మాహ్' మాసోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలనీ జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి ఐసిడిఎస్ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ లోని గౌతమీ సమావేశపు హాలులో శనివారం 'రాష్ట్రీయ పోషన్ మాహ్' మాసోత్సవాల నిర్వహణపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ సెప్టెంబర్ 9వ తేదీ నుండి 30వ తేదీ వరకు జిల్లాలోని ప్రతీ అంగన్వాడీ కేంద్రాలలో రాష్ట్రీయ పోషన్ మాసోత్సవాలను నిర్వహించేందుకు పటిష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు, పిల్లలకు ఆరోగ్యం, పోషణ కి సంబంధించిన ముఖ్యమైన అంశాలపై, పోషకాహారం ప్రాముఖ్యతపై అవగాహనకు "ప్రోటీన్–రిచ్ ప్లేట్" కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. అతి తీవ్రమైన పోషకాహార లోపం (సామ్) పిల్లలను గుర్తించడం, వారి నిర్వహణతో పాటు పోషణ్ వాటికాస్- న్యూట్రీ గార్డెన్స్‌ని అభివృద్ధి చేయడం వంటి కార్యకలాపాలు చేపట్టాలన్నారు.. తల్లి పాల ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పనతో పాటు, పుట్టిన బిడ్డ మొదటి 1000 రోజులలో మంచి పోషణ అవసరాలు, యువతులు, పిల్లలలో రక్తహీనతను తగ్గించే చర్యలపై అవగాహన కలిగించాలన్నారు.

## నీరు రంగు మారుతోంది జాగ్రత్త

**చైనా హెచ్చరిక**

**ఖాట్మండ్, ఆగస్ట్ 29 :** హిమానీనదం బద్దలై ఇప్పటికే నేపాల్‌లో వరదలు రాగా.. ఆ విపత్తు వల్ల పేరుకుపోయిన పెద్ద రాళ్లు, బురద, మంచు, ఇతర శిథిలాలతో టిబెట్ వైపున ఏర్పడిన సరస్సు పొంగుతోంది. దానిపై చైనా మరోసారి హెచ్చరిక చేసింది. ఏ క్షణాన అయినా అది ఉప్పొంగి, కిందికి దూసుకురావొచ్చని పేర్కొంది. నీటి రంగులో మార్పును అందుకు కారణంగా చెప్పింది. నేపాల్ విదేశాంగశాఖతో ఈ సమాచారాన్ని షేర్ చేసుకుంది. విపత్తు తర్వాత ఏర్పడిన సరస్సు రంగు మారుతోంది. ముదురురంగులోకి వస్తోంది.

## కాన్పూర్-మధురై మధ్య ప్రత్యేక రైళ్లు

**వరంగల్, ఆగస్ట్ 29 :** కాన్పూర్ సెంట్రల్– మధురై మార్గంలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని రైల్వేశాఖ సెప్టెంబర్ 2 నుంచి రెండు ప్రత్యేక రైళ్లను అందుబాటులోకి తీసుకువస్తోంది. నవంబర్ 28 వరకు ఈ రైళ్లు కాన్పూర్ సెంట్రల్–మధురై మధ్య నడుస్తాయి. కాన్పూర్ సెంట్రల్ – మధురై (01925) ప్రత్యేక రైలు సెప్టెంబర్ 2 నుంచి నవంబర్ 25 వరకు ప్రతీ బుధవారం ఉదయం 8.10 గంటలకు కాన్పూర్ సెంట్రల్ నుంచి బయలుదేరి శుక్రవారం ఉదయం 7.15 గంటలకు మధురై చేరుకుంటుంది. అదే విధంగా మధురై–కాన్పూర్ సెంట్రల్ (01926) ప్రత్యేక రైలు సెప్టెంబర్ 5 నుంచి నవంబర్ 28 వరకు ప్రతీ శనివారం తెల్లవారుజామున 2.30 గంటలకు మధురై నుంచి బయలుదేరి సోమవారం తెల్లవారుజామున 4.30 గంటలకు కాన్పూర్ సెంట్రల్ చేరుకుంటుంది. ఈ ప్రత్యేక రైళ్లు రెండు తెలుగు రాష్ట్రాల్లోని సిరిపూర్ కాగజ్‌నగర్, రామగుండం, వరంగల్, ఖమ్మం, విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట రైల్వేస్టేషన్‌లలో ఆగుతాయి. వీటిలో సెకండ్ ఏసీ, థర్డ్ ఏసీ, థర్డ్ ఏసీ ఎకానమి, స్లీపర్, జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లు ఉంటాయని దక్షిణమధ్య రైల్వే ముఖ్య ప్రజాసంబంధాల అధికారి ఎ. శ్రీధర్ శనివారం తెలిపారు.

# నేను సొసైటీ భూమిని కబ్జా చేయలేదు : జకారియా

## నాపై వస్తున్న ఆరోపణలు అవాస్తవం



**కూకట్ పల్లి, ఆగస్టు 28, ( జనం వార్త) :** తాను సొసైటీ భూమిని కబ్జా చేయలేదని, సొసైటీ సభ్యులు చెబుతున్నది పూర్తిగా అవాస్తవామని ఐడిపిఎల్ వర్కర్స్ కోపరేటివ్ హౌసింగ్ సొసైటీ లోని 1024 ప్లాటు యాజమాని జకారియా ఆవేదన వ్యక్తం చేశారు. మీడియాకు విడుదల చేసిన ఓ ప్రకటనలో ఆయన మాట్లాడుతూ సొసైటీ సభ్యులు కావాలని తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఐడిపిఎల్ వర్కర్స్ కోపరేటివ్ హౌసింగ్ సొసైటీ భగత్ సింగ్ నగర్ ప్లాట్ నం 1024 ను గత 30 సంవత్సరాల క్రితం నా కష్టార్జితం తో కొనుగోలు చేశామన్నారు. తాను అప్పటి జి హెచ్ యం సి అధికారుల అనుమతులు తీసుకొని నా వయసు రీత్యా నేను నిర్మాణం చేసుకోలేని పరిస్థితి లో ఒక కాంట్రాక్టర్ కు ఇంటి నిర్మాణం చేయడం కోసం అగ్రిమెంట్ చేసి ఇచ్చామన్నారు. భగత్ సింగ్ నగర్ సొసైటీ కమిటీకి సంబంధం లేని మధుసూదన్ అనే వ్యక్తి కొందరితో కలిసి గత ఐదు ఆరు సంవత్సరాలగా తనను మానసికంగా వేధిస్తున్నాడని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అంతే కాకుండా వ్యక్తిగతంగా డబ్బులు ఇవ్వమని తననుబెదిరిస్తున్నాడని ఆరోపించారు. నా ప్లాట్ విషయంలో ఎవరు జోక్యం చేసుకోవద్దని కూకట్ పల్లి సీనియర్ సివిల్ కోర్టుఉత్తర్వులు ఉన్నప్పటికీ కమిటీ మెంబర్ గా ఉన్న మధుసూదన్ భార్య నాగమణి ను అడ్డుపెట్టుకొని నా ప్లాట్ దగ్గర దౌర్జన్యకరంగా హంగామా చేస్తున్నాడని ఆరోపించారు. ఈ మధ్యకాలంలోనే అదే ప్రాంతంలో ఒక బిల్డర్ నిర్మాణం చేస్తుంటే అతనిబెదిరించి, ఆ నిర్మాణదారుడి నుండీ మధుసూదన్ అతని భార్యకు నాగమణి భారీ మొత్తంలో ముడుపులు తీసుకోవడంతో ఆ నిర్మాణం జోలికి వెళ్లడం లేదని ఆరోపించారు. హౌసింగ్ సొసైటీ లో అందరు కొనుగోలు చేసినట్లే తాను ఓ ప్లాట్ ను కొనుగోలు చేశానని, నేను ఎందుకు డబ్బులు ఇవ్వాలని హౌసింగ్ సొసైటీ సభ్యులను ప్రశ్నించారు. రూ. 50 లక్షలు ఇస్తే వాళ్ల జోలికి రానని మధుసూదన్ అనే వ్యక్తి స్వయంగా స్థానికులతో చెపుతున్నట్లు తెలిసిందన్నారు. భగత్ సింగ్ నగర్ నివాసితుడినైన నాకు, నా హక్కులను కాపాడవలసిన సొసైటీ సభ్యులు, అధ్యక్షుడు శ్రీనివాసరావులు మధుసూదన్ అతని భార్య నాగమణి అధికార దౌర్జన్యాలకు భయపడి తనకు మద్దతు తెలపడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మధు-సూదన్ అతని భార్య పై కె పి హెచ్ బి పోలీస్ స్టేషన్ లోఇప్పటికే ఫిర్యాదు చేశానని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. భగత్ సింగ్ నగర్ రెసిడెన్స్ సభ్యులందరూ ఈ విషయాన్ని అర్థం చేసుకోవాలని నావృద్ధాప్య వయసులో తన సొంత ఇంటి కలను నెరవేర్చుకునే కోరికకు మద్దతు ఇవ్వాలని ఆయనరెసిడెన్స్ సభ్యులందరిని కోరుకుంటున్నానన్నారు.

# ఎమ్మెల్యే పై కబ్జా ఆరోపణలు చేస్తే సహించే ప్రసక్తే లేదు : సతీష్ అరోరా

## అధికారం కోసం వలస వచ్చే నాయకులకు ప్రజలు బుద్ధి చెప్పిన సిగ్గు రావడం లేదు



**కూకట్‌పల్లి, ఆగస్టు 29, ( జనం వార్త ) :** ఎన్నికల సమయంలో అధికారం కోసం వలస వచ్చిన ప్యారచూట్ నాయకులైన బండి రమేష్ కు కూకట్ పల్లిఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పై చేసిన కబ్జా ఆరోపణలకు నియోజకవర్గ ప్రజలు తగిన బుద్ధి చెప్పిన ఎమ్మెల్యేపై మొరగడం ఆపలేదనికూకట్ పల్లి బిఆర్ యస్ నియోజకవర్గం కో ఆర్డినేటర్ రెడ్డి సతీష్ అరోరా ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మీడియాకు విడుదల చేసిన ప్రకటనలు ఆయన మాట్లాడుతూ బండి రమేష్ కుప్రభుత్వ భూములేవో,ప్రైవేట్ భూములేవో తెలియవని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను బెదిరించేందుకు, డబ్బులు గుంజేందుకు 22 ఏ లిస్టులో ప్రైవేట్ భూములనుచేర్చి ప్రజలను ఇబ్బందులు పెడుతున్నారన్నారు.హైదర్ నగర్ సర్వే నంబర్ 145,163, హస్మత్ పేట సర్వే నంబర్ 1 అన్ని కూడా పైగా ప్రాపర్టీస్ గాఎస్ -14 లో ఉన్నాయని, అప్పటి నుంచి నిన్న మొన్నటి వరకుహై కోర్టు, సుప్రీం కోర్టులు ప్రైవేట్ వ్యక్తులకు అనుకూలంగా తీర్పులు ఇచ్చాయన్నారు. వాటి ప్రకారం ప్రజలు కొనుగోలు చేసి ఇళ్లు కట్టుకున్నారన్నారు.దీంతో రాజకీయ నాయకుల పాత్ర ఏముందో విచారణ జరపంచాలన్నారు. 1958 నుంచి నేటి వరకు ఎవరెవరు రాజకీయ నాయకులు ఇక్కడి భూముల్లో కబ్జాలు చేసారో మీ ప్రభుత్వం ద్వారా విచారణ జరిపి వెలుగులోకి తీసుకువచ్చి విచారణ జరించాలన్నారు. అంతే కానీబద్దాల పుట్ట మీద మేడలు కట్టిన నీవునోటికి వచ్చినట్లు మాట్లాడితే అదే రీతిలో గుణపాఠం చెబుతామని హెచ్చరిస్తున్నామన్నారు. ఒకవైపు 22 ఏ లో ఉన్న భూములకు న్యాయం చేస్తామంటనే మరో వైపు అవే భూములను కబ్జా అంటున్నారని, ఇది మీ ద్వంద వైఖరికి నిదర్శనం అన్నారు. హస్మత్ పేట సర్వే నంబర్ 1 భూముల్లో ఇరవై ఏళ్ల కిందనే అప్పటి ఎంఎల్సీ ఇప్పటి మీ పార్టీ ఏమ్మెల్యే అపార్ట్మెంట్లు కట్టారు కదా అది కూకట్ పల్లి నియోజకవర్గం ప్రజానీకం అందరికీ తెలుసునని, దమ్ముంటే విచారణ జరూపించాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ భూములపై పూర్తి అవగాహన లేనినువ్వా కబ్జాల గురించి మాట్లాడేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అల్లాపూర్ లోను,గోపాల్ నగర్ లోను మీ పార్టీ నాయకులే కబ్జా చేస్తేమేము కాపాడమనీ తెలిపారు. మీ పార్టీ నాయకులు అవినీతి పరులని మీరే కద ఇటీవల ముగ్గురు కాంగ్రెస్ నాయకులను తొలగించారన్నారు. మళ్లీ సిగ్గు ఎగ్గు లేకుండా అసత్యాలతో మా పార్టీపై మా నాయకుడిపై మాట్లాడుతున్నారన్నారు. ప్రజా జీవితంలో ఎపుడు గెలవని నువ్వు ఇప్పటికే పలు పార్టీలు మారిన నీవు రేపు ఏ పార్టీలో ఉంటావో తెలియని నువ్వు మా హ్యాట్రిక్ ఎమ్మెల్యే నువిమర్శించే స్థాయి నీకు ఉందా..? అని ప్రశ్నించారు.బండి రమేష్ అధికారం కోసం ఏ పార్టీలోకి వెళ్తాడు తెలియదని కాంగ్రెస్ నాయకులు జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు.



# కనకయ్య కుటుంబాన్ని పరామర్శించిన శ్రీనివాస్ రెడ్డి

**దుబ్బాక ఆగస్టు 29 (జనం వార్త) :** సిద్దిపేట జిల్లాదుబ్బాక మండలం గంభీర్ పూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు జింక కనకయ్య తల్లి అనారోగ్యంతో మ-రణించిన విషయం తెలుసుకొని వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తపరిచిన దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి వారితోపాటు దుబ్బాక మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కడుదూరి నరేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కొంగరి రవి, దుబ్బాక పట్టణ అధ్యక్షులు మల్లు గారి రామచంద్రారెడ్డి, గంభీర్ పూర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మిద్దె ప్రసాద్, ఎండిఉస్మాన్, రేపాక దుబ్బ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కోమటిరెడ్డి పద్మారెడ్డి, దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ సోలిపేట ప్రసాద్ రెడ్డి, కొండే గోపాల్ రెడ్డి, ఆరెపల్లి గ్రామ సర్పంచ్ చెట్టి శ్రీనివాస్, వెంకటగిరి తండా గ్రామ సర్పంచ్ రంజా నాయక్, కీసర స్వామి తదితరులు పాల్గొన్నారు..

# కెపిహెచ్‌బిలో ఇందిరమ్మ ఇళ్ల టవర్స్ లబ్ధిదారుల ఎంపిక

- లాటరీ పద్ధతిలో లబ్ధిదారుల ఎంపిక
- కొంత సేపు గందరగోళం.. సర్ది చెప్పిన అధికారులు
- ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు న్యాయం చేయాలి




**కూకట్ పల్లి, ఆగస్టు 29, (జనం వార్త) :** తెలంగాణ ప్రభుత్వం నిరుపేదల సొంతింటి కల నెరవేర్చాలని లక్ష్యంతో నగరంలో చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ లబ్ధిదారుల ఎంపికను శనివారం కేపీహెచ్ బి కాలనీ లోని హౌసింగ్ బోర్డ్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించారు. ఆర్డిఓ రవీందర్ రెడ్డి, హౌసింగ్ బోర్డ్ అధికారుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను చూడడానికి భారీ ఎత్తు న దరఖాస్తుదారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ కూకట్ పల్లి నియోజకవర్గం లో దరఖాస్తు చేసుకున్న వారిలో 5976 మందిని అర్హులుగా గుర్తించామన్నారు. రిజర్వేషన్ల పద్ధతిలో ఎస్ సి లలో 696 మందిని అర్హులుగా గుర్తించి, అందులో 14 శాతం రిజర్వేషన్లలో భాగంగా 67 మందికి లాటరీ పద్ధతిలో కేటాయించామన్నారు. ఎస్టిలలో 135 మందిని అర్హులుగా గుర్తించి, అందులో 5 శాతం రిజర్వేషన్లలో భాగంగా 24మందికి లాటరీ పద్ధతిలో కేటాయించామన్నారు. ఓబీసీలలో 3610 మందిని అర్హులుగా గుర్తించి, అందులో 16 శాతం రిజర్వేషన్లలో భాగంగా 77 మందికి లాటరీ పద్ధతిలో కేటాయించామన్నారు. పిహెచ్ సి కోటలో 26 మందిని అర్హులుగా గుర్తించి, అందులో 5 శాతం రిజర్వేషన్లలో భాగంగా 24 మందికి లాటరీ పద్ధతిలో కేటాయించామన్నారు. ప్రభుత్వ కార్యాలయంలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కేటాయించిన 10 శాతం రిజర్వేషన్ల లో భాగంగా 48 కేటాయించినప్పటికీ 15 మంది లబ్జాలను ఎంపిక చేసినట్లు, మిగతా 33 మంది లబ్ధిదారులను ఎంపిక చేయాల్సి ఉందన్నారు. జనరల్ కోటలో 1498 మందిని అర్హులుగా గుర్తించి, అందులో 50 శాతం రిజర్వేషన్లలో భాగంగా 240 మందికి లాటరీ పద్ధతిలో కేటాయించామన్నారు.

### ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు న్యాయం చేయాలి

ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ లబ్ధిదారుల ఎంపికలో 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నట్లు కల్పిస్తున్నట్లు విస్తృతంగా ప్రచారం నిర్వహించకపోవడంతో చాలామంది అవుట్సోర్సింగ్ ఉద్యోగులు ఇందిరమ్మ ఇళ్ల కు దరఖాస్తు చేసుకోయారు. దరఖాస్తు చేసుకున్న వాళ్లు అందరూ హౌసింగ్ బోర్డ్ శాఖకు చెందిన వారే కావడంతో తమకు అన్యాయం జరిగిందని ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేయడంతో పాటు అక్కడి అధికారులు నిలదీశారు. ఎందుకు విస్తృతంగా ప్రచారం నిర్వహించలేదని, మీ సేవలో దరఖాస్తు సమయంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సంబంధించిన ఆప్షన్ ఎందుకు ఇవ్వలేదని అధికారులు నిలదీశారు. తమకు న్యాయం జరిగేలా చూడాలని అధికారులకు డిమాండ్ చేశారు.

### కొంత సేపు గందరగోళం.. సర్ది చెప్పిన అధికారులు

కేపీహెచ్ బి కాలనీ హౌసింగ్ బోర్డ్ ఫంక్షన్ హాల్ లో ఇందిరమ్మ ఇళ్ల టవర్స్ లబ్ధిదారుల ఎంపిక కోసం నిర్వహించిన లాటరీలో కొంత సేపు గందరగోళం నెలకొంది. ఎస్సీ కేటగిరీలో ఓబీసీ అభ్యర్థుల పేర్లు రావడంపై దరఖాస్తుదారులు ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్సీ కేటగిరీలో ఓబీసీ అభ్యర్థుల పేర్లు ఎలా వచ్చాయంటూ అధికారులను దరఖాస్తుదారులు ప్రశ్నించారు.తమకు అన్యాయం జరుగుతోందంటూ పలువురు దరఖాస్తుదారులు స్టేజ్‌పైకి వెళ్లి ఎస్సీ, ఓబీసీ హౌసింగ్ బోర్డు అధికారులను నిలదీశారు. దీంతో అధికారులు, దరఖాస్తుదారుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీనితో తాత్కాలికంగా డ్రా ఎంపిక నిలిచిపోయింది. అధికారులు దరఖాస్తుదారులకు సర్ది చెప్పి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను అనంతరం సజావుగా సాగేలా చర్యలు తీసుకున్నారు.

# ముఖ్యమంత్రిని విమర్శిస్తే సహించే ప్రసక్తే లేదు : బండి రమేష్

- రేవంత్ రెడ్డి పై చౌకబారు విమర్శలు చేస్తే, తగిన బుద్ధి చెప్తాము
- నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధం
- నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలి
- ప్రజల సానుభూతి కోసం కొత్త నాటకాలు
- కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వం




**కూకట్ పల్లి, ఆగస్టు 29, ( జనం వార్త ) :** కూకట్ పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు కూకట్ పల్లి నియోజకవర్గానికి చేసిందేమీ లేకపోగా స్థాయిని మించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై చౌకబారు విమర్శలు చేస్తున్నాడని, ఎట్టి పరిస్థితుల్లోనూ తాము సహించబోమని టిపిసిసి ఉపాధ్యక్షులు, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్ ఛార్జ్ బండి రమేష్ తీవ్ర స్థాయిలో హెచ్చరించారు. శనివారం మూసాపేటలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది సంవత్సరాలు శాసనసభ్యుడుగా ఉన్న కృష్ణారావు నియోజకవర్గ పరిధిలోని చెరువులు నాళాలు, కుంటలు మొత్తం కబ్జా చేశారని ఆయన ధ్వజమెత్తారు. హస్మత్ పేట సర్వే నెంబర్ 1 లో 100 ఎకరాలకు, పది ఎకరాలు మిగిల్చారని, అల్లాపూర్ లో నాలుగు ఎకరాలకు 2 ఎకరాలు, గోపాల్ నగర్ లో 10 ఎకరాల ఖాళీ స్థలాన్ని కబ్జా చేసి కృష్ణారావు అతని అనుచరులు సొమ్ము చేసుకున్నారని రమేష్ విమర్శించారు. పిజెఆర్ హయాం నుంచి నేటి వరకు కాంగ్రెస్ హయాంలో జరిగిన అభివృద్ధిపై బిఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు తాము సిద్ధమని బండి రమేష్ ఎమ్మెల్యే కృష్ణారావుకు సవాల్ విసిరారు. మొదటిసారి కౌన్సిలర్ గా పోటీ చేసినప్పుడు నీ ఆస్తులు ఎంత ప్రస్తుతం మీ ఆస్తుల విలువ ఎంత అంటూ ఎమ్మెల్యే కృష్ణారావును ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూనే టిఆర్ఎస్ పాలనపై నిప్పులు చెరిగారు. 22 ఏ విషయంలో కృష్ణరావు “ ఉరి, హత్య, ఆత్మహత్య” అంటూ ప్రజల సానుభూతి కోసం నాటకాలు ఆడుతున్నాడని అతన్ని చంపాల్సిన అవసరం మాకు లేదన్నారు. ముఖ్యమంత్రిపై విమర్శలు చేసే సమయంలో నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని బండి రమేష్ ఎమ్మెల్యే కృష్ణారావును హెచ్చరించారు. హౌసింగ్ బోర్డ్ స్థలాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమ్ముకుంటుందన్న కృష్ణారావు విమర్శ పై రమేష్ తీవ్ర స్థాయి-ిలో ధ్వజమెత్తారు. టిఆర్ఎస్ హయాంలో వేల ఎకరాల ప్రభుత్వ భూములను విచ్చలవిడిగా అమ్ముకున్నారని, అది నీకు కనిపించలేదా..? అని విమర్శించారు. రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం,అభివృద్ధి ధ్యేయంగా ముందుకు సాగుతుందన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే లక్ష్యంగా ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్తు, గ్యాస్, రేషన్ కార్డులు పంపిణీ, పెట్రోల్ బంకులు, బస్సులు, ఇందిరమ్మ ఇళ్లు కేటాయింపు వంటి ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు రానున్న ప్రతి ఎన్నికలను కాంగ్రెస్ పార్టీ విజయకేతనం ఎగురవేస్తుందన్నారు. హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం ఫ్లైఓవర్లు, అండర్పాస్, బ్రిడ్జిలు, లింకు రోడ్స్, స్కై వాక్ వంతెనలు నిర్మిస్తుందన్నారు.రాష్ట్ర ప్రజల వైద్యం కోసం రూ 10 లక్షల బీమా సౌకర్యాన్ని ఏర్పాటు చేస్తుందన్నారు. ప్రభుత్వం రాగానే 70 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించిందని, విద్యా విధానంలో నూతన వరవడిని ప్రవేశపెట్టిందన్నారు.

# గొర్రెల కాపరిపై దాడి.. రెండు గొర్రెలు మృతి

## నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని యాదవ సంఘం డిమాండ్



**నాగర్ కర్నూల్, ఆగస్టు 29( జనం వార్త):** నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో గొర్రెల కాపరిపై దాడి ఘటన కలకలం రేపింది. గొర్రెలను మేపేందుకు వెళ్లిన పాశం నాగయ్య యాదవ్‌పై కొత్త రమేష్ రావు అనే వ్యక్తి దాడికి పాల్పడినట్లు బాధితుడు ఆరోపించాడు. ఈ ఘటనలో రెండు గొర్రెలను కూడా చంపినట్లు ఆయన పేర్కొన్నారు. తనకు సంబంధం లేని ప్లాట్‌లో గొర్రెలు మేస్తున్నాయనే కారణంతో రమేష్ రావు తనపై దాడి చేసినట్లు నాగయ్య తెలిపారు. మూగజీవాలైన గొర్రెలను చంపడంతో పాటు గొర్రెల కాపరిపై దాడి చేసిన నిందితుడిపై క్రిమినల్ కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని యాదవ సంఘం నాయకులు డిమాండ్ చేశారు.

ఈ మేరకు యాదవ సంఘం నాయకులు డీఎస్పీ బుర్రి శ్రీనివాస్, నాగర్ కర్నూల్ ఎస్పై వెంకట్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. బాధితుడు నాగయ్య యాదవ్‌కు న్యాయం చేయాలని కోరారు. వినతిపై స్పందించిన డీఎస్పీ బుర్రి శ్రీనివాస్.. ఘటనపై చర్యలు తీసుకొని, నిందితుడిపై కఠిన చర్యలు తీసుకుంటామని, బాధితుడికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత యాదవ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ యాదవ్‌తో పాటు జిల్లా యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు.




# జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం పాదయాత్ర!

- హామీ అమలు, చిరకాల డిమాండ్‌లు పరిష్కరించాలి: టిడబ్ల్యూజేఎఫ్
- బోనకల్‌లో ఘన స్వాగతం..
- జర్నలిస్టుల పోరాటానికి బీఆర్ఎస్, బీజేపీ, టీడీపీ, సీపీఎం, సీపీఐల సంఘీభావం

**బోనకల్, ఆగస్టు 29 :** జర్నలిస్టుల చిరకాల డిమాండ్ అయిన ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించి ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర శనివారం బోనకల్‌కు చేరుకుంది. టిడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు సయ్యద్ ఖదీర్, కార్యదర్శి కొత్తపల్లి శ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలో ఎర్రుపాలెం నుంచి మధిర మీదుగా సాగుతున్న పాదయాత్రకు బోనకల్ ప్రెస్‌క్లబ్ సభ్యులు ఘన స్వాగతం పలికారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలంటూ నినాదాలతో పాదయాత్ర కొనసాగింది.

### పార్టీలకు అతీతంగా సంఘీభావం

బోనకల్ వేబ్రిడ్జి నుంచి సినిమా హాల్ సెంటర్ వరకు పాదయాత్ర నిర్వహించారు. అనంతరం బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల డిమాండ్‌కు మద్దతుగా బీఆర్ఎస్, బీజేపీ, టీడీపీ, సీపీఎం, సీపీఐ, ఎమ్మార్పీఎస్ తదితర పార్టీల నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు పాదయాత్రలో పాల్గొని సంఘీభావం ప్రకటించారు. జర్నలిస్టుల న్యాయమైన డిమాండ్‌ను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించాలని వారు కోరారు. అనంతరం పాదయాత్ర తహసీల్దార్ కార్యాలయానికి చేరుకోగా, టిడబ్ల్యూజేఎఫ్ ప్రతినిధులు తహసీల్దార్ సీహెచ్. సుధాకర్‌కు జర్నలిస్టుల సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జర్నలిస్ట్ మందా సత్యానందం కుటుంబాన్ని పాదయాత్ర బృందం పరామర్శించింది. ఆయన చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబానికి యూనియన్ అండగా ఉంటుందని, ప్రభుత్వ పరంగా అందాల్సిన సహాయం అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా కోశాధికారి తేనె వెంకటేశ్వర్లు, బోనకల్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు దేగల వేలాద్రి, సభ్యులు బాజీ షరీఫ్, వై. గౌతం, షేక్ బడే, మాగి ముఖేష్, నాగటి రాజశేఖర్, షేక్ మధార్ సాహెబ్, తగరం రమేష్, తెల్లబోయిన సుమన్ తదితరులు పాల్గొన్నారు.



# నూతన ఎమ్మార్వోకు బీఆర్ఎస్ నాయకుల అభినందనలు

## చింతకాని తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన కర్ణ శ్రీని కలిసిన పార్టీ నాయకులు శుభాకాంక్షలు తెలిపి.. మండల అభివృద్ధికి సహకరించాలని ఆకాంక్ష

**చింతకాని, ఆగస్టు 29 :** చింతకాని మండల నూతన తహసీల్దార్ (ఎమ్మార్వో)గా బాధ్యతలు చేపట్టిన కర్ణ శ్రీని బీఆర్ఎస్ నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు శుభాకాంక్షలు తెలియజేసి అభినందనలు తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు మంకెన రమేష్, గురజాల హనుమంతరావు, బొడ్డు వెంకట రామారావు, గడ్డం శ్రీనివాసరావు, తునికి పోటీ పూర్ణయ్య, సర్పంచులు పరిశుద్ధరావు, చాపలమడుగు వీరబాబు, ఉపసర్పంచ్ గోగుల నరసరావు, మిరియాల శ్రీనివాసరావు, పట్టేటి గోపయ్య, నాగేశ్వరరావు తదితరులు ఎమ్మార్వోను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మండల ప్రజలకు రెవెన్యూ సేవలు మరింత సమర్థవంతంగా అందేలా కృషి చేయాలని, ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించేలా ముందుకు సాగాలని వారు ఆకాంక్షించారు.



# క్రీడలే ఆరోగ్యకరమైన యువతకు బాట!

## ప్రిన్సిపల్ డాక్టర్ చలసాని ప్రసాద్

### బడంగ్‌పేట డిగ్రీ కళాశాలలో ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

**రంగారెడ్డి, ఆగస్టు 29:** యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చేందుకు ప్రతి సంవత్సరం ఆగస్టు 29న జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని బడంగ్‌పేట డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చలసాని ప్రసాద్ అన్నారు. శనివారం కళాశాల సమావేశ మందిరంలో నిర్వహించిన జాతీయ క్రీడా దినోత్సవ కార్యక్రమంలో విద్యార్థినీ, విద్యార్థులు క్రీడా స్ఫూర్తితో పాల్గొన్నారు. కార్యక్రమానికి స్పోర్ట్స్ కోఆర్డినేటర్ నరసింహారాజు అధ్యక్షత వహించారు.

### చదువుతో పాటు క్రీడలకూ ప్రాధాన్యం

నేటి తరం విద్యార్థులు కేవలం విద్యకే పరిమితం కాకుండా క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ చురుగ్గా పాల్గొనాలని నరసింహారాజు సూచించారు. క్రీడలు శారీరక ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతో పాటు క్రీడాకారుల్లో పోటీ తత్వం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ చలసాని ప్రసాద్ మాట్లాడుతూ క్రీడా సంస్కృతిని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం 2017లో ‘ఖేలో ఇండియా’ పథకాన్ని ప్రారంభించిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం తొలిసారిగా ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు ఆతిథ్యం ఇవ్వడం ద్వారా స్థానిక క్రీడాకారులకు జాతీయ స్థాయిలో తమ ప్రతిభను ప్రదర్శించే అవకాశాలు పెరగడంతో పాటు క్రీడా మౌలిక వసతులు మరింత బలోపేతం కానున్నాయని అన్నారు. ఎన్ఎస్-ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ వెంకటరెడ్డి మాట్లాడుతూ ఫిట్‌నెస్, ఆరోగ్యం, శారీరక దారుఢ్యం, క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంలో జాతీయ క్రీడా దినోత్సవం ప్రాధాన్యత కలిగినదని అన్నారు. హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని ఈ రోజును నిర్వహిస్తున్నామని తెలిపారు. వాణిజ్య విభాగం ఇన్‌చార్జి నరసింహ మాట్లాడుతూ విద్య, క్రీడలు విద్యార్థుల జీవితంలో రెండు కీలక అంశాలని, విద్యను అభ్యసించినట్లే క్రీడల్లోనూ పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఐక్యూ కోఆర్డినేటర్ రామరాజు, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.




## ఢిల్లీలో పెరిగిన సీఎన్‌జీ ధరలు

### కిలోపై రూ.3.89 చొప్పున పెంపు

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 29 :** దేశ రాజధాని ఢిల్లీతో పాటు పరిసర ప్రాంతాల్లో సీఎన్‌జీ ధరలు మరోసారి పెరిగాయి. శనివారం ఉదయం 6 గంటల నుంచి కిలో సీఎన్‌జీపై రూ.3.89 చొప్పున పెంచుతున్నట్లు నగర గ్యాస్ పంపిణీ సంస్థ ఇంద్రప్రస్థ గ్యాస్ లిమిటెడ్ ప్రకటించింది. దీంతో ఢిల్లీలో ప్రస్తుతం కిలో సీఎన్‌జీ ధర రూ.86.98కి చేరుకుంది. అలాగే, నోయిడాలో రూ.95.59, ఘాజియాబాద్‌లో రూ.95.59, గురుగ్రామ్‌లో రూ.92.01, మీరట్‌లో రూ.95.47, ముజఫర్‌నగర్‌లో రూ.95.47, షామ్లీలో రూ.95.47కు ధరలు చేరుకున్నాయి. పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు పెరగడం, అంతర్జాతీయ మార్కెట్లో ఎల్‌ఎన్‌జీ ధరలు భారీగా పెరగడం తాజా ధరల పెంపునకు ప్రధాన కారణమని ఐజీఎల్ వెల్లడించింది. పశ్చిమాసియా సంక్షోభం ప్రారంభమైన తర్వాత సీఎన్‌జీ ధరలు పెరగడం ఇది ఐదోసారి. మే 15 నుంచి ఇప్పటివరకు నాలుగు విడతల్లో ధరలు పెరిగాయి. తాజా పెంపుతో ఢిల్లీ, పరిసర ప్రాంతాల్లో వేలాది మంది సీఎన్‌జీ వాహనదారులపై అదనపు భారం పడనుంది. సీఎన్‌జీతో నడిచే ప్రైవేటు కార్లు, ట్యాక్సీలు, ఆటోలు, వాణిజ్య వాహనాల నిర్వహణ వ్యయం పెరగనుంది. దీంతో ఈ భారం చివరికి ప్రయాణికులపై పడనుంది. అంతర్జాతీయంగా ఎల్‌ఎన్‌జీ ధరలు సంక్షోభానికి ముందు స్థాయి-ంతో పోలిస్తే దాదాపు రెట్టింపయ్యాయని ఐజీఎల్ తెలిపింది. సీఎన్‌జీ సరఫరాకు అవసరమైన సహజ వాయువులో గణనీయమైన భాగాన్ని దిగుమతి చేసుకున్న ఎల్‌ఎన్‌జీ ద్వారానే సమకూర్చుకుంటున్నామని పేర్కొంది. హోర్ముజ్ జలసంధి మీదుగా ఎల్‌ఎన్‌జీ కార్గో రవాణాకు అంతరాయం ఏర్పడటంతో ధరలు ఒక్కసారిగా పెరిగాయని వివరించింది. అలాగే, శీతాకాలం సమీపిస్తుండటంతో యూరప్ దేశాలు సహజ వాయువు నిల్వలను పెంచుకునేందుకు ప్రయత్నిస్తున్నాయని చెప్పింది. దీంతో ఎల్‌ఎన్‌జీ ధరలకు రెక్కలొచ్చి సీఎన్‌జీ సరఫరా వ్యయం గణనీయంగా పెరిగిందని పేర్కొంది. ఈ కారణంగానే రేట్లు పెంచాల్సిన పరిస్థితి నెలకొందని ఐజీఎల్ వెల్లడించింది.

## అమరావతిలో స్పోర్ట్స్ సిటీ రాబోతోంది

- 2,500 ఎకరాల్లో భారీ 'స్పోర్ట్స్ సిటీ', 'స్పోర్ట్స్ యూనివర్సిటీ'
- క్రీడా దినోత్సవ ముగింపు సభలో మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడి

**తిరుపతి,ఆగస్ట్29 :** అమరావతిలో స్పోర్ట్స్ సిటీ రాబోతోందని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. అంతర్జాతీయ క్రీడా దినోత్సవ ముగింపు సభలో మాట్లాడుతూ.. భారతదేశానికే ఆదర్శంగా అమరావతిలో 2,500 ఎకరాల్లో భారీ 'స్పోర్ట్స్ సిటీ', 'స్పోర్ట్స్ యూనివర్సిటీ' ఏర్పాటు కానున్నాయని తెలిపారు. క్రీడలను ప్రోత్సహించటంలో భాగంగా సీఎం చంద్రబాబు.. ప్రముఖుల అకాడమీలను ప్రోత్సహిస్తున్నారన్నారు. పీవీ సింధు, గోపీచంద్, కిదాంబి శ్రీకాంత్ వంటి ప్రముఖుల అకాడమీలకు ప్రభుత్వం నుంచి స్థల కేటాయించినట్లు చెప్పారు. అరకు నుంచి తిరుపతి వరకు, శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకు గ్రామీణ స్థాయి ప్రతిభను వెలికితీసేందుకు 6 ప్రత్యేక అకాడమీలను ఏర్పాటు చేశామని మంత్రి వెల్లడించారు. భవిష్యత్తులో ప్రపంచంలో ఏ ఈవెంట్ జరిగినా ఏపీ నుంచి కనీసం ఒక క్రీడాకారుడైనా పాల్గొనాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. విశాఖపట్నంలో ప్రధాని మోదీ సమక్షంలో జరిగిన ప్రపంచ యోగా దినోత్సవంలో 5 లక్షల మంది పాల్గొని ప్రపంచ రికార్డు సృష్టించారన్నారు. రాష్ట్రాన్ని 'హెల్దీ, వెల్దీ అండ్ హ్యాపీ స్టేట్'గా తీర్చిదిద్దడమే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచన అని చెప్పుకొచ్చారు. జాతీయ క్రీడా దినోత్సవం (ధ్యాన్‌చంద్ జయంతి), తెలుగు భాషా దినోత్సవం(గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి) సందర్భంగా తిరుపతి వేదికగా క్రీడాకారులకు మంత్రి కొల్లు రవీంద్ర శుభాకాంక్షలు తెలియ జేశారు. రాబోయే 50 ఏళ్లకు సరిపడా అత్యుత్తమ క్రీడా మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. క్రీడాభివృద్ధి కోసం రాష్ట్రాన్ని 3 జోన్లుగా(వైజాగ్, అమరావతి, తిరుపతి) విభజన చేసినట్లు తెలిపారు. క్రీడా పరికరాల తయారీ కోసం నెల్లూరు పరిసరాల్లో 1,000 ఎకరాల్లో 'స్పోర్ట్స్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్' ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. తిరుపతిలో కేటాయించిన స్థలంలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఆడిటోరియాలు, క్రీడా ప్రాంగణాల నిర్మాణం జరుగుతోందన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సూచనల మేరకు పాఠశాలల గ్రౌండ్లను సీఎస్సార్ నిధులతో అభివృద్ధి చేసి, గ్రామీణ ప్రతిభను వెలికితీసేలా కార్యాచరణను రూపొందించనున్నట్లు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి వెల్లడించారు.

## బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం

### తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు కురిసే ఛాన్స్

**విశాఖపట్టణం, ఆగస్ట్ 29 :** బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నదని.. ఈ అల్పపీడన ప్రభావంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో మళ్లీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ఆంధ్రప్రదేశ్‌లో వాతావరణ పరిస్థితులు వేగంగా మారుతున్నాయి. ముఖ్యంగా ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో నేడు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. కొన్ని చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వానలు పడొచ్చని అంచనా వేశారు. బంగాళాఖాతంలో సంభవిస్తున్న వాతావరణ మార్పుల కారణంగా వర్షాల తీవ్రత పెరిగే అవకాశం ఉందని, సెప్టెంబర్ 2 వరకు ఉత్తరాంధ్రతోపాటు రాయలసీమలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు. తెలంగాణలోని పలు జిల్లాల్లో సైతం తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. రానున్న 24 గంటల్లో హైదరాబాద్ నగరంలో ఆకాశం మేఘావృతమై ఉంటుందని, అప్పుడప్పుడు వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొన్నది. వర్షాల నేపథ్యంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు హెచ్చరిం చారు. ఉరుములు, మెరుపులు సంభవించే సమయంలో చెట్లు, విద్యుత్ స్తంభాలు, బహిరంగ ప్రదేశాలకు దూరంగా ఉండాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రైతులు వాతావరణ హెచ్చరికలకు అనుగుణంగా వ్యవసాయ పనులు చేపట్టాలని కోరారు. వర్షం కురుస్తున్న సమయంలో వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# ప్రధాని మరోమారు విదేశీ పర్యటన

### ఉజ్బెకిస్తాన్, కిర్గిజ్‌లలో పర్యటించనున్న మోడీ



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 29 :** ప్రధాని నరేంద్ర మోదీ మరో విదేశీ పర్యటనకు సిద్ధం అయ్యారు. రెండు దేశాల విదేశీ పర్యటనకు బయలుదేరనున్నారు. ఉజ్బెకిస్తాన్ అధ్యక్షుడు షవ్‌కత్ మిర్జియోయెవ్ ఆహ్వానం మేరకు ఆగస్టు 29, 30 తేదీల్లో ప్రధాని మోదీ ఉజ్బెకిస్తాన్‌లో ద్వైపాక్షిక పర్యటన చేయనున్నారు. తాష్కెంట్‌లో ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే అంశాలపై కీలక చర్చలు జరగనున్నాయి. ఉజ్బెకిస్తాన్‌లో ప్రధాని మోదీకి ఇది నాలుగో పర్యటన కానుంది. ఈ పర్యటనలో భారత్, ఉజ్బెకిస్తాన్ వ్యూహాత్మక భాగస్వామ్యంతో పాటు.. వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ రంగాల్లో పరస్పర సహకారంపై ఇరు దేశాల నేతలు చర్చించనున్నారు. అలాగే డిజిటల్ కనెక్టివిటీ, ఇంధనం, విద్య తదితర రంగాల్లో ద్వైపాక్షిక సంబంధాలను మరింత విస్తరించే అంశాలపై కూడా చర్చలు జరగనున్నాయి. భారత్ 'విక్షిత్ భారత్ 2047' అభివృద్ధి దార్శనికతతో పాటు ఉజ్బెకిస్తాన్ 'ఉజ్బెకిస్తాన్-2030' అభివృద్ధి ప్రణాళికలపై కూడా ఇరు దేశాల మధ్య అభిప్రాయాల మార్పిడి జరగనుంది. భవిష్యత్‌లో ఆర్థిక, సాంకేతిక, మౌలిక వసతుల రంగాల్లో పరస్పర సహకారాన్ని పెంచుకునే అవకాశాలను పరిశీలించనున్నారు. తాష్కెంట్‌లో ప్రధాని మోదీ పలు ప్రత్యేక కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. లాల్ బహదూర్ శాస్త్రి మెమోరియల్‌ను సందర్శించడంతో పాటు తాష్కెంట్ స్టేట్ యూనివర్సిటీ ఆఫ్ ఓరియంటల్ స్టడీస్‌లోని మహాత్మా గాంధీ కేంద్రాన్ని కూడా సందర్శించనున్నారు. ఉజ్బెకిస్తాన్ పర్యటన అనంతరం ప్రధాని మోదీ ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 1 వరకు కిర్గిజ్ రిపబ్లిక్‌లో పర్యటించనున్నారు. కిర్గిజ్ అధ్యక్షుడు సదిర్ జపరోవ్ ఆహ్వానం మేరకు ప్రధాని మోదీ బిష్కెక్‌కు వెళ్లనున్నారు. ఈ పర్యటనలో భాగంగా 26వ షాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర సమావేశంలో ప్రధాని మోదీ పాల్గొంటారు. ఎస్‌సీఓ 25వ వార్షికోత్సవం సందర్భంగా ఈ శిఖరాగ్ర సమావేశం జరగనుంది. 2017 నుంచి భారత్ ఎస్‌సీఓలో పూర్తి సభ్యదేశంగా కొనసాగుతోంది. సమావేశంలో భద్రత, అనుసంధానం, ప్రాంతీయ సహకారం, అభివృద్ధి అవకాశాలపై భారత ప్రాధాన్యతలను ప్రధాని మోదీ ప్రస్తావించనున్నారు. ఈ సందర్భంగా ఎస్‌సీఓ సభ్యదేశాల నేతలతో ప్రధాని మోదీ ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించే అవకాశం ఉంది. అలాగే కిర్గిజ్ రిపబ్లిక్‌లో జరిగే 6వ వరల్డ్ నోమాడ్ గేమ్స్ ప్రారంభోత్సవానికి కూడా ప్రధాని మోదీ హాజరుకానున్నారు. మధ్య ఆసియా సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా నిలిచే ఈ క్రీడలు ప్రాంతీయ సాంస్కృతిక సంబంధాలకు ప్రత్యేక ప్రాధాన్యతను కలిగి ఉన్నాయి.

## క్రీడాకారులకు ప్రధాని మోడీ శుభాకాంక్షలు

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 29 :** జాతీయ క్రీడల దినోత్సవం సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ క్రీడాభిమానులకు శుభాకాంక్షలు చెప్పారు. యువతరానికి స్ఫూర్తిగా నిలవడంలో క్రీడల ప్రాధాన్యతను పేర్కొన్నారు. నిబద్ధత కలిగిన ప్రతి క్రీడాకారుడిని ప్రశంసించారు. మేజర్ ధ్యాన్‌చంద్‌కు నివాళులర్పించారు. అలాగే భారత మాజీ క్రికెటర్ శిఖర్ ధావన్ కూడా సోషల్ మీడియాలో శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ఓ వీడియోను షేర్ చేశారు. ప్రతి క్రీడాకారుడికి.. మీ అంకితభావం, అభిరుచి, పట్టుదల అందరికీ గర్వకారణం. తరతరాలకు స్ఫూర్తినిచ్చే ప్రతిభావంతుడైన దిగ్గజ మేజర్ ధ్యాన్ చంద్‌కు నివాళులర్పిస్తున్నానని ప్రధాని మోదీ పేర్కొన్నారు. క్రీడలు అంటే కేవలం గెలవడం మాత్రమే కాదని నేనెప్పుడూ నమ్ముతా. కలలు కనడం, కష్టపడటం, ఎదురుదెబ్బలను తట్టుకొని ముందుకు సాగడం నేర్పిస్తాయి. జాతీయ క్రీడాదినోత్సవం నాడు యువతను మరింత ఎక్కువగా గేమ్స్ ఆడేలా ప్రోత్సహిద్దాం క్రికెటర్ శిఖర్ ధావన్ అన్నారు.

## అరకు కాఫీకి ప్రపంచస్థాయి గుర్తింపు తీసుకొచ్చాం

- సంజీవని యాప్ ఓ గేమ్ ఛేంజర్
- మన ఆరోగ్యం.. మన ఫోన్‌లోనే
- అరకు పర్యటనలో సిఎం చంద్రబాబు

**పాడేరు, ఆగస్ట్ 29 :** ఏజెన్సీ ప్రాంతానికి వస్తే కొత్త శక్తి, ఉత్సాహం వస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. అల్లూరు జిల్లా అరకులోయ మండలం గన్నెలలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఎం మాట్లాడుతూ.. అరకు కాఫీకి ప్రపంచస్థాయి గుర్తింపు తీసుకొచ్చామన్నారు. ఆ రోజుల్లోనే ఆయుర్వేద వైద్యం గిరిజనులకు అందించిన వ్యక్తి అల్లూరి సీతారామ రాజు. ఆయన సేవలకు గుర్తుగా భోగాపురం ఎయిర్‌పోర్టుకు ఆయన పేరు పెట్టాం. సంజీవని యాప్ ఓ గేమ్ ఛేంజర్. మీకు అనారోగ్యం వస్తే విశాఖ, పాడేరు వెళ్లాల్సి వచ్చేది. మీ ఆరోగ్యం మీ ఫోన్‌లో ఉంది. ఎక్కడికి వెళ్లినా మీ ఆరోగ్యం ఫోన్‌లో చెక్ చేసుకోవచ్చు. ప్రతి ఒక్క గిరిజన బిడ్డకు మెరుగైన ఆరోగ్యం ఇవ్వాలని సంకల్పించాం. గిరిజనుల ఆరోగ్యం కాపాడే బాధ్యత ఈ ప్రభుత్వానిది. ఏజెన్సీ ఏరియాలో మరికొన్ని సెల్‌టవర్లు పెట్టించి కనెక్టివిటీ పెంచుతాం. గిరిజనుల ప్రతి ఒక్క సమస్యకు పరిష్కార మార్గం చూపిస్తాం. 3 నెలల్లో ఇక్కడ ఉన్న అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మెరుగుపరుస్తాం. ఏ వైద్య పరీక్ష అయినా.. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిపేలా ఏర్పాట్లు చేస్తాం. సూపర్ సిక్స్ సూపర్ హిట్ చేసిన ఘనత ఈ ప్రభుత్వానిదే. గిరిజనులకు 50 ఏళ్లకే పింఛన్లు ఇస్తున్నాం.. దీంతో నేను సంతృప్తి చెందడం లేదు. గిరిజన ప్రాంతంలో ఉన్న ఉద్యోగాలన్నీ గిరిజనులకే దక్కాలనేది ఈ ప్రభుత్వ విధానం. అందరికీ ఆమోదయోగ్యమైన జీవోను మళ్లీ తీసుకువస్తామని హామీ ఇస్తున్నా. వీలైనంత త్వరగా అన్ని గ్రామాలకు రోడ్లు వేసేలా చర్యలు తీసుకుంటాం. అరకు కాఫీకి ప్రపంచ స్థాయి గుర్తింపు తెచ్చాం. ఏజెన్సీ ప్రజలకు ఆదాయం అరకు కాఫీ, మిరియాల నుంచి వస్తోంది' అని సీఎం తెలిపారు. గన్నెల పంచాయతీ ఆర్.కె.నగర్‌లో ప్రజలతో ముఖాముఖి నిర్వహించిన సీఎం చంద్రబాబు.. ప్రభుత్వం నుంచి అందుతున్న సేవలు, ఇతర అంశాలపై అడిగి తెలుసుకున్నారు. గర్భిణీతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ గ్రామంలో 47 ఇళ్లు, 189 మంది జనాభా ఉండగా.. ఇక్కడ పాపులేషన్ మేనేజ్‌మెంట్ బాగుందని, అందుకు గల విధానాలను అడిగి తెలుసుకున్నారు. ఓ మహిళ తన కుమార్తె నీట్ శిక్షణలో ఉందని తెలుపగా.. శెభాష్ అన్న ముఖ్యమంత్రి.. అందరూ ఇదే స్ఫూర్తితో పిల్లలని చదివించాలన్నారు. మహిళలతో మాట్లాడుతూ పిల్లల భవిష్యత్తు కోసం ఏం చేస్తున్నారు.. ఏం చేయబోతున్నారు? అని ప్రశ్నించారు. అందరి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

## చేతి వృత్తి దారుల జీవితాలలో మార్పురావాలి

- సామాజిక ఆర్థిక సంక్షేమం, ఆత్మగౌరవం కల్పించాలి
- చేతి వృత్తి దారుల డిమాండ్
- ఏలూరు రూరల్ మండలం తహసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా

**ఏలూరు, ఆగస్టు 29 :** కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న దుష్ట విధానాల నుండి చేతి వృత్తి దారుల జీవితాలలో మార్పు రావాలని, సామాజిక ఆర్థిక సంక్షేమం, ఆత్మగౌరవం కల్పించాలని కోరుతూ చేతి వృత్తి దారులు చాటపర్రు గ్రామంలోని ఏలూరు రూరల్ మండల తహసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ చేతి వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర పిలుపు మేరకు ఏలూరు జిల్లా చేతి వృత్తి దారుల సమాఖ్య ఆధ్వర్యంలో ధర్నా చేసి, తహసిల్దార్ జి విజయ కుమార్ రాజు కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా చేతి వృత్తి దారుల సమాఖ్య ఏలూరు జిల్లా కన్వీనర్ కడుపు కన్నయ్య, కో కన్వీనర్ పోటేలు పెంటయ్య, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ చేతి వృత్తిదారుల సంక్షేమానికి స్వతంత్రంగా మంత్రిత్వ శాఖ ను ఏర్పాటు చేయాలని, చేతి వృత్తిదారులకు ఉప ప్రణాళికను ఏర్పాటు చేసి చట్టబద్ధతను కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రతి చేతి వృత్తి దారునికి వయసుతో నిమిత్తం లేకుండా 50శాతం సబ్సిడీతో 5 లక్షల రూపాయలు వరకు సొంత పూసి కత్తితో కార్పొరేషన్ ల ద్వారా రుణాలు అందజేయాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. 50 సంవత్సరాల నిండిన ప్రతి చేతి వృత్తిదారునికి 6వేల రూపాయలు సామాజిక పెన్షన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. చేతి వృత్తిదారుల పిల్లలకు ఆశ్రమ పాఠశాలలో కేజీ నుండి పీజీ వరకు ఉచిత విద్య ను అందించాలని, ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు కల్పించాలని, వృత్తుల నిర్వహణకు అవసరమైన ముడిసరుకు, సౌకర్యాలు, సదుపాయాలు కల్పించాలని కోరారు. రజక, మత్స్య వృత్తిదారులకు చెరువులు మంజూరు చేయాలని, క్షౌర, రజక వృత్తిదారులకు 300 యూనిట్లు వరకు ఉచిత కరెంటు సౌకర్యం కల్పించాలని, 11 రకాల చేనేత వస్త్రాలకు చేనేత రిజర్వేషన్ చట్టం అమలు చేయాలని , గీత, వడ్డెర, ఎరుకుల, మేదర , కుమ్మరి వృత్తిదారులకు ప్రభుత్వం అన్ని రకాల సంక్షేమాలను, ఆర్థిక సహాయాన్ని అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. గొర్రెల మేకల పెంపకం దారుల సొసైటీలకు ఐదు ఎకరాల భూమి ఇవ్వాలని, అటవీ శాఖ అధికారుల వేధింపుల నుండి రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో వివిధ వృత్తులలో పనిచేస్తున్న వృత్తిదారులు కోరాడ నాగేశ్వరరావు, దాసరి రాము, గంటా వెంకట్రావు, నక్క అప్పయ్యమ్మ, కొమరపురి మంగ, అంబటి చిన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.



## కూటమిది నరికే సంస్కృతి కాదు.. నాటే సంస్కృతి

- భూమాతను కాపాడుకోవడం మనందరి బాధ్యత
- ప్రకృతి, ఆధ్యాత్మికతల అద్భుత సమ్మేళనం "అశ్వత్థ నారాయణ వివాహం"
- అరణ్యారామంలో రావి, వేప మొక్కలు నాటిన నాగబాబు దంపతులు

**మంగళగిరి, ఆగస్టు 29 :** ప్రకృతి సంరక్షణలో భారత్ ప్రపంచానికే ఆదర్శంగా నిలవాలని ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్ కొణిదెల నాగబాబు అన్నారు. హరిత ఆంధ్రప్రదేశ్ లక్ష్య సాధనలో భాగంగా ప్రతి ఒక్కరూ పచ్చదనం పెంపునకు తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి, వాటి సంరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. శనివారం మంగళగిరిలోని అరణ్యారామం నందవనంలో సాంప్రదాయ రావి, వేప మొక్కల నాటే కార్యక్రమంలో నాగబాబు, సతీమణి పద్మజ కలిసి పాల్గొన్నారు. శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం రావి, వేప మొక్కలను నాటారు. ఈ సందర్భంగా నాగబాబు మీడియాతో మాట్లాడుతూ "భూమాత మనకు పరోక్షంగా జన్మనిచ్చిన తల్లి. మనం పుట్టినప్పటి నుంచి చివరి శ్వాస వరకు అవసరమైన ఆహారం, నీరు, గాలి, నివాసం వంటి ఎన్నో వనరులను భూమాత నుంచే పొందుతున్నాం. మన తల్లిదండ్రులు మనకు పెట్టే ప్రతి ఆహారపు ముద్ద కూడా భూమాత ప్రసాదించినదే. అలాంటి భూమాతకు తిరిగి మనం ఏమి చేస్తున్నాం అని ప్రతి ఒక్కరు ఆలోచించాలి. అడవులను నరికి వేయడం, విచక్షణారహితంగా మైనింగ్ చేయడం, ప్రకృతిని కాలుష్యం చేయడం ద్వారా మనమే భూమాతను గాయపరుస్తున్నాం. భూమాతను కాపాడటం మన బాధ్యత మాత్రమే కాదు, మన కర్తవ్యం అన్నారు. రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖల పరిశోధన, శిక్షణ కార్యక్రమాల పర్యవేక్షణ కోసం 24 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 'అరణ్యారామం' భవన డిజైన్లను నాగబాబు పరిశీలించారు. ఈ భవన నిర్మాణాన్ని 10 నెలల్లో పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశామని పీసీసీఎఫ్ చీఫ్ పి.వి. చలపతిరావు నాగబాబు కి వివరించారు. అలాగే తాడేపల్లి పరిధిలోని అటవీ ప్రాంత వివరాలను తెలియజేశారు. ఈ భవన నిర్మాణ ప్రక్రియలో భాగంగా తొలగించాల్సి వచ్చిన 73 చెట్లను వృథాగా నరికేయకుండా, వేరే చోట విజయవంతంగా పునఃప్రతిష్ఠాపన చేశారు. ఈ విధంగా వేరే చోట నాటిన చెట్లను స్వయంగా పరిశీలించి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీసీఎఫ్ వైల్డ్ లైఫ్ ఎన్. నాగేశ్వరరావు, సీసీఎఫ్ గుంటూరు వై. శ్రీనివాసరెడ్డి, సీసీఎఫ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఏపీ గ్రీన్ బి.ఎన్.ఎన్. మూర్తి, డిఎఫ్ఓ గుంటూరు హిమశైలజ పాల్గొన్నారు.

## కొత్త కారు ప్రారంభంలో విషాదం

### అదుపుతప్పి మామపైకి దూసుకెళ్లిన కారు

**హైదరాబాద్, ఆగస్ట్ 29 :** కొత్త కారు కొన్న ఓ కుటుంబం సంతోషం నిమిషాల వ్యవధిలోనే విషాదంగా మారింది. కారుకు పూజ చేయించడం కోసం అల్లుడితో పాటు గుడికి వెళ్లిన మామ.. అదే కారు కిందపడి ప్రాణాలు కోల్పోయారు. నగరానికి చెందిన ఓ దంపతులు ఇటీవల కొత్త కారును కొనుగోలు చేశారు. దానికి పూజ చేయించేందుకు తమ బంధువు(మామయ్య) రామచంద్రరావును ఆహ్వానించారు. దీంతో అల్లుడు, కుమార్తెతో కలిసి పెద్దమ్మగుడికి వెళ్లారాయన. అల్లుడు కారును డ్రైవింగ్ చేస్తుండగా.. ఒక్కసారిగా అదుపుతప్పి రామచంద్ర రావు మీదకు దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఆయనకు తీవ్రగాయాలయ్యాయి. అప్రమత్తమైన కుటుంబసభ్యులు.. హుటాహుటిన స్థానిక ఆసుపత్రికి తరలించారు. అయితే.. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ ఆయన మృతి చెందారు. దీంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## ప్రజల్లోకి కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు

### పార్టీ శ్రేణులతో మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే

**నిజామాబాద్, ఆగస్ట్ 29 :** కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే బీఆర్ఎస్ కార్యకర్తలకు సూచించారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనలో జరిగిన వైఫల్యాలను ప్రజలకు వివరించేందుకు సెప్టెంబర్ 2 నుంచి వారం రోజుల పాటు నిర్వహించనున్న సమరభేరి కార్యక్రమాలపై బీఆర్ఎస్ జుక్కల్ నియోజకవర్గ స్థాయి నాయకుల సన్నాహక సమావేశం పెద్ద కొడపగల్ మండల కేంద్రంలో శనివారం నిర్వహించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు నిర్వహించనున్న ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు ప్రజలకు అనేక హామీలు ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి అమలులో విఫలమైందని విమర్శించారు. ప్రజలను నమ్మించి ఓట్లు తీసుకుని అధికారంలోకి వచ్చిన అనంతరం ఇచ్చిన హామీలను విస్మరించడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిదర్శనమని ఆరోపించారు. సెప్టెంబర్ 2 నుంచి వారం రోజుల పాటు జరిగే కార్యక్రమాల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు చురుగ్గా పాల్గొని గ్రామగ్రామాన ప్రజలను కలవాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు, వాటిలో అమలైనవి, అమలు కానివి, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. 1000 రోజుల కాంగ్రెస్ పాలనపై ప్రజల ముందు ప్రశ్నలు ఉంచి, హామీల అమలుపై ప్రభుత్వాన్ని నిలదీయాలని అన్నారు.

## గిడుగు రామమూర్తికి ఘన నివాళులు

**ఏలూరు, ఆగస్టు 29 :** ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా గ్రంథాలయసంస్థ, ఏలూరు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో తెలుగు వాడుక భాష ఉద్యమ పితామహులు, సంఘ సంస్కర్త, శాస్త్రవేత్త గిడుగు వెంకట రామమూర్తి 163 వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు ఘనంగా నివాళులు అర్పించారు. డిప్యూటీ లైబ్రేరియన్ ఎ నారాయణ రావు తదితరులు గిడుగు రామమూర్తి చేసిన సేవలను స్మరించుకున్నారు. గ్రాంథికభాషలో ఉన్న తెలుగు వచనాన్ని ప్రజల వాడుకభాషలోకి తీసుకు వచ్చి, నిత్యవ్యవహారంలోని భాషలో ఉన్న అందాన్నీ, విలువనూ తెలియజెప్పిన మహనీయులు అంటూ కొనియాడారు. ఆంధ్రదేశంలో వ్యావహారిక భాషోద్యమానికి మూలపురుషులు అయిన రామమూర్తి వ్యవహారిక భాషను గ్రంథ రచనకు స్వీకరింపజేయడానికి చిత్తశుద్ధితో కృషిచేసిన వ్యక్తి అన్నారు. పండితులకే పరిమితమైన సాహిత్యసృష్టి, సృజనాత్మకశక్తి ఉన్న ప్రతి ఒక్కరికీ వీలైందన్నారు. ఆయన జయంతి ను తెలుగు భాషా దినోత్సవంగా రాష్ట్ర మంతటా జరుపుకుంటున్నామని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కేంద్ర గ్రంథాలయం సిబ్బంది, పాఠకులు, తదితరులు, పాల్గొన్నారు.

# పశ్చిమాసియాలోనూ విమానాశ్రయాలు

## జీఎంఆర్ ప్రణాళికలు

విమానాశ్రయాల నిర్వహణ సంస్థ జీఎంఆర్ గ్రూపు, అంతర్జాతీయంగా తమ వ్యాపారాన్ని మరింత విస్తరించేందుకు అడుగులు వేస్తోంది. పశ్చిమాసియా, మధ్య ఆసియా, తూర్పు ఐరోపా, ఆగ్నేయాసియా ప్రాంతాల్లో విమానాశ్రయాల నిర్వహణ, అనుబంధ వ్యాపార రంగాల్లో ఉన్న భారీ అవకాశాలను చేజిక్కించుకునేందుకు ప్రయత్నిస్తామని సంస్థ ఛైర్మన్ జీఎం రావు 2025-26 వార్షిక నివేదికలో వెల్లడించారు. విమాన ప్రయాణాలకు గిరాకీ వేగంగా పెరుగుతోందని, అభివృద్ధి చెందుతున్న మార్కెట్లలో ఇది మరింత ఎక్కువగా ఉందని జీఎం రావు పేర్కొన్నారు. అందుకే వివిధ దేశాల్లో విమానాశ్రయ కాంట్రాక్టులతో పాటు, అనుబంధ వ్యాపారాల విస్తరణపై దృష్టి సారించినట్లు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా అనిశ్చితి, సంక్లిష్టతలున్నా, సరైన ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ, నిలకడైన వృద్ధి సాధించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రస్తుతం కంపెనీ ఇండోనేషియాలో విమానాశ్రయాన్ని నిర్వహిస్తుండగా, గ్రీస్‌లో కొత్త విమానాశ్రయాన్ని అభివృద్ధి చేస్తోంది.







## లాభాల్లోకి స్టాక్ మార్కెట్

రెండు రోజుల వరుస నష్టాల అనంతరం స్టాక్ మార్కెట్ పుంజుకుంది. ఐటీ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో ప్రధాన సూచీలు లాభాల్లో ముగిశాయి. విదేశీ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందడమూ కలిసొచ్చింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 2 పైసలు పెరిగి 95.43 వద్ద ముగిసింది. బ్యారెల్ బ్రెంట్ ముడిచమురు 0.76% నష్టంతో 89.20 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో చైనా, దక్షిణ కొరియా మినహా మిగతావి లాభాల్లో ముగిశాయి. ఐరోపా మార్కెట్లు సానుకూల ధోరణిలో ఆరంభమయ్యాయి.





# ధోనీకి చెన్నై సూపర్ కింగ్స్ బంపరాఫర్!

వాటాల విషయంలో చెన్నై సూపర్ కింగ్స్‌తో మహేంద్ర సింగ్ ధోనీ విభేదాలు తలెత్తాయని ప్రచారం జరిగింది. సీఎస్‌కేలోని 25 శాతం షేర్లను తనకు అమ్మాలని ధోనీ కోరగా.. ఆ టీమ్ యజమాన్యం నిరాకరించిందని వార్తలు వచ్చాయి. ఇప్పటి వరకు ఈ వార్తలపై ధోనీ గానీ, సీఎస్‌కే మేనేజ్‌మెంట్ కానీ స్పందించలేదు. దాంతో సీఎస్‌కేకు ధోనీ దూరంగా ఉంటాడనే అభిప్రాయం వ్యక్తమైంది. కానీ ధోనీకి చెన్నై సూపర్ కింగ్స్ బంపరాఫర్ ఇచ్చినట్లు తాజాగా ఓ నివేదిక బయటకు వచ్చింది. సీఎస్‌కే హెడ్ కోచ్‌గా లేదా కన్సల్టెంట్‌గా బాధ్యతలు చేపట్టాలని ధోనీకి ఆఫర్ ఇచ్చినట్లు సదరు రిపోర్ట్ పేర్కొంది. అయితే ఆఫర్‌పై ధోనీ ఇంకా నిర్ణయం తీసుకోలేదని, దాంతో సీఎస్‌కే మేనేజ్‌మెంట్ వేచి చూస్తుందని తెలుస్తోంది. ధోనీ నుంచి నిర్ణయం వెలువడిన తర్వాత వచ్చే సీజన్‌కు సంబంధించిన ప్రణాళికలను, వేలంలో అనుసరించాల్సిన వ్యూహాలను సిద్ధం చేయాలని సీఎస్‌కే నిర్ణయించినట్లు సమాచారం. ఐపీఎల్ 2026 సీజన్‌లోచెన్నై సూపర్ కింగ్స్ తీవ్రంగా నిరాశపర్చింది. రుతురాజ్ గైక్వాడ్ సారథ్యంలో 14 మ్యాచ్‌ల్లో 6 విజయాలు మాత్రమే సాధించి పాయింట్స్ టేబుల్‌లో 8వ స్థానంలో నిలిచింది. గాయం కారణంగా ధోనీ ఈ సీజన్ మొత్తానికి దూరమయ్యాడు. ఐపీఎల్ చరిత్రలోనే ధోనీ ఒక సీజన్ మొత్తం ఆడకపోవడం ఇదే తొలిసారి.అంతేకాకుండా హెడ్ కోచ్‌గా 19 ఏళ్లు సేవలందించిన స్టీఫెన్ ఫ్లేమింగ్ కూడా జట్టును వీడాడు. 2008లో ఆటగాడిగా జట్టులోకి వచ్చిన ఫ్లెమింగ్.. 2009లో హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టాడు. అతని పర్యవేక్షణలో సీఎస్‌కే ఐదు టైటిళ్లు గెలిచింది. అతను తప్పుకోవడంతో సీఎస్‌కే కొత్త కోచ్‌ను ఎంపిక చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. సీఎస్‌కే ఆఫర్‌పై ధోనీ తేల్చిన తర్వాతే కొత్త కోచ్ ఎంపిక ప్రక్రియను మొదలు పెట్టాలనుకుంటుంది. ధోనీ ఏ విషయం చెప్పకపోవడం వల్ల సీఎస్‌కే కార్యకలాపాలన్నీ ఆగిపోయినట్లు తెలుస్తోంది. అయితే ఐపీఎల్ 2027 సీజన్‌లో ధోనీ ఆటగాడిగా కొనసాగడనే విషయం స్పష్టంగా అర్థమవుతోంది. ఐపీఎల్ 2025 మెగా వేలానికి ముందు ధోనీని సీఎస్‌కే అనామక ప్లేయర్‌గా రూ.4 కోట్లకు తీసుకుంది. 2024 నుంచి 2026 వరకు సీఎస్‌కే వరుసగా ప్లే ఆఫ్స్ చేరలేదు. ఈ క్రమంలోనే ధోనీ పర్యవేక్షణలో జట్టును పునర్నిర్మించాలని సీఎస్‌కే యోచిస్తోంది.



# జర్మనీని చిత్తు చేసిన టీమిండియా

బెల్జియం, నెదర్లాండ్స్ సంయుక్తంగా ఆతిథ్యమిచ్చిన 2026 ఎఫ్ఐహెచ్ మహిళల హాకీ వరల్డ్ కప్‌లో అద్భుత ప్రదర్శన కనబరిచిన భారత మహిళల హాకీ జట్టుకు హాకీ ఇండియా 50 లక్షల రూపాయల భారీ నగదు పురస్కారాన్ని అనౌన్స్ చేసింది. ఆమ్‌స్టెల్‌వీన్ వేదికగా జరిగిన 5/6 క్లాసిఫికేషన్ మ్యాచ్‌లో ప్రపంచ నంబర్ 5 జట్టు జర్మనీని 3-1 తేడాతో ఓడించి భారత జట్టు ఐదో స్థానంలో నిలిచింది. 1974 లో జరిగిన ప్రారంభ ఎడిషన్‌లో నాల్గో స్థానం సాధించిన తర్వాత, గత 52 ఏళ్ల వరల్డ్ కప్ చరిత్రలో భారత మహిళల జట్టు నమోదు చేసిన అత్యుత్తమ ఫలితం ఇదే. టోర్నీ ఆద్యంతం కేవలం నెదర్లాండ్స్ చేతిలో మాత్రమే ఓడిన భారత్, బలమైన చైనా, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా జట్లను డ్రాలతో నిలువరించి, సౌతాఫ్రికాను 6-1 తో చిత్తు చేసింది. ఈ ఘనతపై హాకీ ఇండియా ప్రెసిడెంట్ పద్మశ్రీ దిలీప్ టిర్కీ స్పందిస్తూ జట్టును కొనియాడాడు. "భారత మహిళల హాకీ చరిత్రలో ఇది నిజంగా ఒక అద్భుతమైన ఫలితం. 52 ఏళ్ల తర్వాత ప్రపంచకప్‌లో ఐదో స్థానాన్ని దక్కించుకోవడం జట్టు కఠిన శ్రమ, పోరాట పటిమకు నిదర్శనం. మా ప్రశంసలకు గుర్తుగా జట్టుకు 50 లక్షల రూపాయల నగదు బహుమతిని ప్రకటిస్తున్నాను. ఇది రాబోయే టోర్నీల్లో మరింత ఉన్నత స్థాయికి చేరేందుకు ప్లేయర్లకు స్ఫూర్తినిస్తుందని ఆశిస్తున్నాను" అని తెలిపాడు. హాకీ ఇండియా సెక్రటరీ జనరల్ భోలా నాథ్ సింగ్ కూడా మాట్లాడుతూ కెప్టెన్ సలీమా టెటే బృందం దేశం గర్వించేలా చేసిందని, ఆసియన్ గేమ్స్ కు ముందు ఇది గొప్ప ఆత్మవిశ్వాసాన్ని ఇస్తుందని పేర్కొన్నాడు. తొలి రెండు క్వార్టర్లలో ఇరు జట్ల మధ్య తీవ్ర పోటీ నెలకొనగా గోల్స్ నమోదు కాకపోవడంతో ఉత్కంఠ నెలకొంది. భారత గోల్ కీపర్ బిచ్చు దేవి, డిఫెన్స్ విభాగం జర్మనీ పెనాల్టీ కార్నర్లను సమర్థవంతంగా అడ్డుకున్నాయి.

## తర్వాతి టీ20 వరల్డ్ కప్ వరకు

# కెప్టెన్‌గా ఉంటా

### స్టార్ బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్

భారత టీ20 జట్టుకు 2026 వరల్డ్ కప్ ట్రోఫీని అందించిన స్టార్ బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్ అనూహ్యంగా జట్టుకే దూరం కావడంపై తొలిసారి మనసులో మాట బయట పెట్టాడు. అద్భుతమైన ట్రాక్ రికార్డు ఉన్నప్పటికీ అతడి స్థానంలో శ్రేయస్ అయ్యర్‌ను సెలెక్టర్లు టీ20 కెప్టెన్‌గా నియమించడం క్రికెట్ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. ఐర్లాండ్, ఇంగ్లాండ్ పర్యటనల నుంచి సూర్యను పూర్తిగా తప్పించారు. ఈ నిర్ణయం తీసుకున్న కొన్ని నెలల తర్వాత మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రాతో జరిగిన ఇంటర్వ్యూలో సూర్యకుమార్ తన మనసులోని భావాలను పంచుకున్నాడు. జట్టు జాబితాలో తన పేరు లేకపోవడం చూసినప్పుడు తాను కేవలం నవ్వుకున్నానని చెప్పాడు. రాబోయే ఒలింపిక్స్ తో పాటు తర్వాతి టీ20 వరల్డ్ కప్ వరకు తనే కెప్టెన్‌గా ఉంటానని అనుకున్నట్లు సూర్య వ్యాఖ్యానించాడు. "జట్టు ప్రకటనలో నా పేరు కనిపించనప్పుడు ఒక్కసారిగా నవ్వాను. కెరీర్‌లో ఒత్తిడి వచ్చినప్పుడల్లా నేను రిలాక్స్‌గా ఉంటూ నవ్వుతూనే ముందుకు సాగాను. 2026 వరల్డ్ కప్ గెలిచిన తర్వాత మరో రెండేళ్ల పాటు జట్టును ముందుకు తీసుకెళ్లగలనని, ఒలింపిక్స్ లో సారథ్యం వహిస్తానని భావించాను. అయితే సెలెక్టర్ల ఆలోచనలు వేరేలా ఉన్నాయి. భవిష్యత్తు కోసం వేరొకరు కెప్టెన్‌గా ఉంటే మంచిదని వారు భావిస్తే ఆ నిర్ణయాన్ని నేను గౌరవిస్తాను. మరొకరి నాయకత్వంలో జట్టు బాగా ఆడితే నాకు ఎలాంటి సమస్యా లేదు" అని సూర్యకుమార్ తెలిపాడు. తన తర్వాత కెప్టెన్ అయిన శ్రేయస్ అయ్యర్‌తో తనకు మంచి అనుబంధం ఉందని, అతడు గొప్ప లీడర్ అని సూర్య కొనియాడాడు. అయితే సెలెక్టర్ల నిర్ణయం తనను తీవ్రంగా నిరాశపరిచిందని తెలిపాడు. "రెండేళ్ల కాలంలో మేం ఒక్క ద్వైపాక్షిక సిరీస్ కూడా ఓడిపోలేదు. ఆసియా కప్, టీ20 వరల్డ్ కప్ టైటిళ్లు గెలిచాం. అంతా




సవ్యంగా సాగుతున్న సమయంలో ఇలాంటి ఆకస్మిక మార్పు ఎందుకు జరిగిందో నాకు అర్థం కాలేదు. గెలవగానే ఇది ఎలా సాధ్యం అనే ప్రశ్న నా మనసులో మెదిలింది. దాదాపు నెలన్నర పాటు ఇంట్లోనే కూర్చుండిపోయాను. బంధువులు, స్నేహితులు వచ్చి ఓదార్చినా వారు వెళ్లిన తర్వాత ఒంటరిగా ఉన్నప్పుడు ఆ బాధ తెలిసేది" అని పేర్కొన్నాడు. జట్టు ఎంపిక ప్రకటనకు రెండు మూడు రోజుల ముందే సెలెక్టర్లు తనకు ఫోన్ చేసి 'ఇక వేరే మార్గంలో ముందుకెళ్లే సమయం వచ్చింది' అని చెప్పినట్లు సూర్యకుమార్ తెలిపాడు. "వారు అలా చెప్పినప్పుడు నేను ఏమాత్రం కోపగించుకోలేదు. జట్టు మంచి కోసం వారు ఒక నిర్ణయం తీసుకున్నారు. దాన్ని హుందాగా స్వీకరించాను. దేశం కోసం ఆడటానికి నేను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటాను. మీరు ఎప్పుడు పిలిచినా బరిలోకి దిగేందుకు నా బ్యాట్ సిద్ధంగా ఉంటుంది" అని సూర్యకుమార్ తెలిపాడు.

# బాబర్ ఆజామ్ చెత్త రికార్డ్..

పాకిస్థాన్ టెస్ట్ కెప్టెన్ బాబర్ ఆజామ్ చెత్త రికార్డ్ నమోదు చేశాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో సుదీర్ఘ కాలం పాటు సెంచరీ చేయని బ్యాటర్‌గా అప్రతిష్టను మూటగట్టుకున్నాడు. పాకిస్థాన్ బ్యాటింగ్ కింగ్‌గా గుర్తింపు పొందిన బాబర్ ఆజామ్.. సెంచరీల నిరీక్షణలో బౌలర్లతో పోటీపడుతున్నాడు. ఇంగ్లండ్‌తో రెండో టెస్ట్‌లో బాబర్ ఆజామ్ దారుణంగా విఫలమైన సంగతి తెలిసిందే. 10 బంతుల్లో 8 పరుగులే చేసి జోష్ టంగ్ బౌలింగ్‌లో క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. లార్డ్స్ వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో పాకిస్థాన్ తొలి ఇన్నింగ్స్‌లో 110 పరుగులకే కుప్పకూలింది. బాబర్ ఆజామ్ 2023 నుంచి ఒక్క సెంచరీ చేయలేదు. ఈ మధ్య కాలంలో అతను 36 ఇన్నింగ్స్‌లు ఆడాడు. దాంతో 2023 నుంచి టెస్ట్‌ల్లో సెంచరీ చేయకుండా అత్యధిక ఇన్నింగ్స్‌లు ఆడిన ఆటగాళ్ల జాబితాలో బాబర్ ఆజామ్ బౌలర్లతో పోటీపడుతున్నాడు. ఈ జాబితాలో మిచెల్ స్టార్క్(50), పాట్ కమిన్స్(47), మహమ్మద్ సిరాజ్(44), నాథన్ లయన్(41) వంటి ప్రముఖ బౌలర్లు బాబర్ ఆజామ్ కంటే ముందున్నారు. ప్రభాత్ జయసూర్య, తైజుల్ ఇస్లామ్‌తో కలిసి బాబర్ ఆజామ్ ఈ జాబితాలో ఐదో స్థానంలో కొనసాగుతున్నాడు. స్పెషలిస్ట్ బ్యాటర్ అయిన బాబర్ ఆజామ్.. బౌలర్లతో పోటీపడటంపై అభిమానులు విమర్శలు గుప్పిస్తున్నారు. పాకిస్థాన్ బ్యాటింగ్ కింగ్ బౌలర్లతో పోటీపడుతున్నాడని ఎగతాళి చేస్తున్నారు. పాకిస్థాన్ ఇన్నింగ్స్ అజాన్ అవైస్(102 బంతుల్లో 7 ఫోర్లతో 46), సౌద్ షకీల్(16) మినహా అంతా సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. ఇంగ్లండ్ బౌలర్లలో ఓలీ రాబిన్సన్(4/11) నాలుగు వికెట్లు తీయగా.. జోఫ్రా ఆర్చర్(3/26) మూడు వికెట్లు పడగొట్టాడు.



జోష్ టంగ్(2/27) రెండు వికెట్లు తీసాడు. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 290 పరుగులకు ఆలౌటైంది. జోర్డాన్ కాక్స్(55), జేమీ స్మిత్(61) హాఫ్ సెంచరీతో రాణించగా.. గస్ అట్కిన్సన్(45), జోష్ టంగ్(30 నాటౌట్) విలువైన పరుగులు చేశారు. పాకిస్థాన్ బౌలర్లలో మహమ్మద్ అబ్బాస్(4/73) నాలుగు వికెట్లు తీయగా.. మహమ్మద్ అలీ(3/86) మూడు వికెట్లు పడగొట్టాడు. ఖుర్రమ్ షెహ్‌జాద్, అలీ ఉస్మాన్ తలో వికెట్ తీసారు. 180 పరుగుల భారీ ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇంగ్లండ్.. రెండో రోజు ఆట ముగిసే సమయానికి 3 వికెట్లకు 81 పరుగులు చేసింది. ప్రస్తుతం ఇంగ్లండ్ 261 పరుగుల ఆధిక్యంలో ఉంది. ఈ మ్యాచ్‌లోనూ పాకిస్థాన్‌కు ఘోర పరాజయం తప్పేలా లేదు.

# సౌతాఫ్రికాపై నమీబియా సంచలన విజయం!

ఓడలు బళ్ళు అవుతాయి, బళ్ళు ఓడలవుతాయి" అంటే ఇదేనేమో. వరల్డ్ బెస్ట్ క్రికెట్ టీమ్‌లో ఒకటైన సౌతాఫ్రికాకు బిగ్ షాక్ తగిలింది. పసికూన నమీబియా చేతిలో ఘోర పరాభావం ఎదురైంది. జింబాబ్వే, నమీబియా, సౌతాఫ్రికా మధ్య జరుగుతున్న ముక్కోణపు టీ20 సిరీస్‌లో సఫారీ టీమ్ శుభారంభం చేయలేకపోయింది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో సమష్టిగా రాణించి నమీబియా 18 పరుగుల తేడాతో సౌతాఫ్రికాను ఓడించింది. ఈ విజయంతో నమీబియా సరికొత్త చరిత్రను లిఖించింది. అంతర్జాతీయ టీ20ల్లో సౌతాఫ్రికాపై నమీబియాకు ఇది రెండో విజయం. గతేడాది జరిగిన ట్రై సిరీస్‌లోనూ నమీబియా 4 పరుగుల తేడాతో సౌతాఫ్రికాను ఓడించింది. దాంతో సౌతాఫ్రికాను రెండు సార్లు ఓడించిన తొలి అసోసియేట్ టీమ్‌గా నమీబియా చరిత్రకెక్కింది. టీ20ల్లో సౌతాఫ్రికాను నెదర్లాండ్స్ ఒకసారి ఓడించింది. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2022లో ఆ జట్టు ఈ విజయం సాధించింది. మరే అసోసియేట్ టీమ్ సౌతాఫ్రికాను ఓడించలేదు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన నమీబియా 20 ఓవర్లలో 9 వికెట్లకు 163 పరుగులు చేసింది. జాన్ ఫ్రైలింక్(38 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లతో 60) హాఫ్ సెంచరీతో రాణించగా.. లౌరెన్ స్టీన్‌కాంప్(29 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 41) దూకుడుగా ఆడాడు. సౌతాఫ్రికా బౌలర్లలో ప్రేనెలన్ సుబ్రాయెన్ మూడు వికెట్లు తీయగా.. డాన్ జాన్సెన్, బ్యోర్న్ ఫోర్టుయిన్ రెండేసి వికెట్లు పడగొట్టారు. న్కోబాని మోకోయెనా, డెవాల్డ్ బ్రెవిస్ తలో వికెట్ తీసారు.

# పొరపాటున 'డబ్బు' బదిలీ చేశారా?

## వెనక్కి తెచ్చుకోవచ్చు

ఇప్పుడంతా డిజిటల్ కరెన్సీ హవా నడుస్తోంది. ఏది కొన్నా ఆన్‌లైన్‌లోనే డబ్బు చెల్లిస్తున్నాం. యూపీఐ చెల్లింపులు చేసేస్తున్నాం. దేశంలో జులై నెలలో యూపీఐ లావాదేవీల పరిమాణం 4.1 శాతం, విలువ 3.3 శాతం పెరిగింది. ఎప్పుడూ లేనివిధంగా 29.88 ట్రిలియన్ల విలువైన లావాదేవీలు జరిగాయి. కొన్నిసార్లు పొరపాటున ఒకరికి బదులుగా మరొకరికి డబ్బు బదిలీ జరుగుతుంది. అలాంటి సందర్భాల్లో ఆ డబ్బును వెనక్కి తీసుకునేందుకు మార్గాలున్నాయి. అవేంటంటే... యూపీఐలో పెద్దగా ఇబ్బంది లేకుండానే.. ఒక క్లిక్‌తోనే వెంటనే నగదు బదిలీ అయిపోతుంది. ఇది చాలా సులభమైన పద్ధతి. కానీ.. పొరపాటున వేరొక కాంటాక్ట్‌ను కానీ, తప్పు యూపీఐ ఐడీని కానీ నమోదు చేస్తే.. ఆ డబ్బు మరొకరికి వెళ్తుంది. ఈ పరిస్థితి ఎదురైతే.. కంగారుపడిపోతాం. ఇలా జరిగితే ఆ డబ్బులు పూర్తిగా పోయినట్లు కాదు. ఈ మొత్తాన్ని తిరిగి రికవరీ చేసేందుకు అవకాశాలున్నాయి.

### ఎలాగంటే...

- మీరు ఉపయోగించే యూపీఐ యాప్‌లోని 'హెల్ప్' ఆప్షన్‌పై క్లిక్ చేయాలి.
- మన సమస్యను చాట్ అసిస్టెంట్‌లో నమోదు చేయాలి. మీ చాట్‌ను బట్టి.. సంబంధిత లావాదేవీని యాప్ చూపిస్తుంది.
- ఆ లావాదేవీని సెలెక్ట్ చేసుకుని రిపోర్ట్ చేయాలి. భవిష్యత్తు అనుశీలన కోసం ఫిర్యాదు రిఫరెన్స్ నంబరును గుర్తు పెట్టుకోవాలి.
- సైబర్ మోసగాళ్ల మాటలు నమ్మి.. బదిలీ చేస్తే వెంటనే 1930 నంబరుకు కాల్ చేసి ఫిర్యాదు చేయాలి.
- ఫిర్యాదు చేసేందుకు కావాల్సిన వివరాలు..
- యూటీఆర్ లేక ట్రాన్సాక్షన్ ఐడీ.
- లావాదేవీకి సంబంధించిన తేదీ, సమయం.
- బదిలీ చేసిన మొత్తం.
- అవతలి వ్యక్తి యూపీఐ ఐడీ లేదా మొబైల్ నంబర్.
- లావాదేవీకి సంబంధించి స్క్రీన్‌షాట్లు.

### బదిలీ చేసే ముందు...

- నగదు బదిలీ చేయాల్సిన వ్యక్తికి సంబంధించిన పేరు, యూపీఐ ఐడీని ఒకటికి రెండు సార్లు సరిచూసుకోవాలి.
- హడావుడిగా చెల్లింపులు చేయడం మంచిది కాదు.
- పిన్ నమోదు చేసే ముందు బదిలీ చేయాల్సిన మొత్తాన్ని చెక్ చేసుకోవాలి.




# రూ.37,700 కోట్ల జియో ఐపీఓ

ముకేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్ డిజిటల్ సేవల విభాగమైన జియో ప్లాట్‌ఫామ్స్ లిమిటెడ్ తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) ప్రతిపాదనకు మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ ఆమోదముద్ర వేసింది. ఈ ఐపీఓ ద్వారా 3.8 బిలియన్ డాలర్లు (సుమారు రూ.37,700 కోట్లు) సమీకరించాలన్నది జియో ప్రతిపాదన. ఇదే జరిగితే దేశంలోనే అతిపెద్ద ఐపీఓగా నిలిచే అవకాశం ఉంది. ఐపీఓకు అనుమతి కోరుతూ ముసాయిదా పత్రాలను జూన్‌లో సెబీకి జియో ప్లాట్‌ఫామ్స్ సమర్పించింది. శుక్రవారం (ఆగస్టు 28న) సెబీ అంగీకరించింది. ఈ ఐపీఓలో 27 కోట్ల తాజా షేర్లను (కంపెనీలో 2.9% వాటాకు సమానం) కంపెనీ జారీ చేయనుంది. ఐపీఓ కోసం కంపెనీ విలువను 137 బిలియన్ డాలర్లు (సుమారు రూ.13,00,000 కోట్లు)గా అంచనా వేసినట్లు తెలుస్తోంది. ఈ ప్రకారం చూస్తే ఐపీఓ ద్వారా రూ.37,700 కోట్లు రావొచ్చని జియో అంచనా వేస్తోంది. దేశీయ అతిపెద్ద స్టాక్ ఎక్స్ఛేంజ్ నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) కూడా ఐపీఓకు రానుండగా, ఆ ఇష్యూ పరిమాణం రూ.30,000 కోట్లుగా ఉండే అవకాశం ఉంది. దీంతో పోలిస్తే జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీఓనే పెద్దది కానుంది. పబ్లిక్ ఇష్యూ ద్వారా సమీకరించే నిధులను జియో ప్లాట్‌ఫామ్స్ అనుబంధ సంస్థ రిలయన్స్ జియో ఇన్ఫోకామ్‌కు చెందిన దాదాపు రూ.27,500 కోట్ల రుణాల చెల్లింపునకు, సాధారణ కార్పొరేట్ అవసరాల కోసం కంపెనీ వినియోగించనుంది.

## బేబీమూన్ ట్రిప్‌ను ఎంజాయ్ చేస్తోన్న సామ్



ప్రస్తుతం సమంత తల్లికాబోతున్న ఆనందంలో ఉన్నారు. ఒకవైపు బేబీమూన్ ట్రిప్‌ను ఎంజాయ్ చేస్తోన్న సామ్.. మరోవైపు వ్యాయామం చేస్తూ అభిమానులతో ఫొటోలు పంచుకుంటున్నారు. తాజాగా ఇన్‌స్టా వేదికగా ఫ్యాన్స్‌తో ముచ్చటించారు. కొందరు తల్లులు ఆమెకు సలహాలు ఇవ్వగా.. మరికొందరు ఆమెతో వారి అనుభవాలు పంచుకున్నారు. బేబీ కోసం కావాల్సిన వస్తువులన్నీ కొన్నాను. వాటిని చూస్తుంటే కాస్త కంగారుగా ఉంది. అందుకే ప్రస్తుతానికి వాటిని ప్యాక్ చేసి ఆ బ్యాగ్‌ను ఒక లాప్‌టాప్ స్టాండ్‌గా వాడుతున్నానన్నారు. ప్రెగ్నెన్సీతో ఉన్నప్పటి నుంచి నాకు కలలు వస్తున్నాయి. మీకు కూడా వస్తున్నాయా అంటూ ప్రశ్నలు వేస్తున్నారు. నిజంగానే.. ఈ విచిత్రమైన కలల గోల ఏంటో అర్థం కావట్లేదు. మరోవైపు11 కేజీలు పెరిగాననన్నారు. కొత్తగా తల్లి అయిన తర్వాత చాలా మార్పులు వస్తాయట. నేను ఆ క్షణాల కోసం ఆత్రుతగా ఎదురుచూస్తున్నాను. పుట్టినవారికి పాలు పట్టడం, జోలపాడి నిద్రపోయేలా చేయడం.. ఈ పనులు ఫుల్ టైమ్ జాబ్‌లా మారిపోతాయి. అది చాలా అందమైన, గొప్ప అనుభూతి. జీవితాన్ని మార్చే అనుభవం. మాతృత్వం ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంచుతుంది. మాతృత్వం వల్ల ఆత్మవిశ్వాసం పెరుగుతుందని ఇప్పటి వరకు తెలియదు. నేను ఊహించలేదు కూడా. మంచి విషయాన్ని తెలిపారు. ధన్యవాదాలు అంటున్నారు.

## ప్యారడైజ్ నుంచి యెష నాగుల కట్టమీద పాట విడుదల

నేచురల్ స్టార్ నాని, టాలెంటెడ్ డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల క్రేజీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మోస్ట్ అంటెసిపేటెడ్ పాన్ ఇండియా మూవీ 'ది ప్యారడైజ్' నుంచి మేకర్స్ క్రేజీ అప్‌డేట్‌ను అందించారు. ఈ చిత్రం నుంచి రెండో సింగిల్‌గా మోస్ట్ పాపులర్ ఫోక్ సాంగ్ అయిన 'యెష నాగుల కట్ట మీద' పాటను డిజిటల్ వేదికగా విడుదల చేశారు. తెలంగాణ నేటివిటీని ప్రతిబింబించేలా సాగే ఈ జానపద గీతాన్ని సినిమాలో మరింత మాస్ వైబ్‌తో రీమిక్స్ వెర్షన్‌గా తెరకెక్కించారు. ఇప్పటికే సోషల్ మీడియాలోనూ, ప్రజల నోళ్లలోనూ నానుతున్న ఈ పాటకు అనిరుధ్ రవిచందర్ అందించిన రాకింగ్ మాస్ బీట్స్ ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. 'దసరా' బ్లాక్‌బస్టర్ తర్వాత నానితో పాటు తెరపై ఈ పాటకు రాబోయే మాస్ స్టెప్స్ సినిమాపై అంచనాలను తారాస్థాయికి చేర్చుతున్నాయి. ఈ క్యాచీ సాంగ్‌కు కాసర్ల శ్యామ్ సాహిత్యాన్ని అందించగా, జంగి రెడ్డి మరియు సింగర్ ప్రభ తమ శక్తివంతమైన గాత్రంతో ప్రాణం పోశారు. ఎస్.ఎల్.వి. సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి అత్యంత భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా సెప్టెంబర్ 24, 2026న గ్రాండ్‌గా ప్రేక్షకుల ముందుకు రానుంది.



# నాగార్జున వందో సినిమా

## కింగ్ 100 గ్లింప్స్ విడుదల

అక్కినేని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న నాగార్జున కెరీర్‌లోని ప్రతిష్టాత్మక 100వ సినిమా సందడి మొదలైంది. 'కింగ్ 100'గా ప్రచారంలో ఉన్న ఈ ల్యాండ్‌మార్క్ ప్రాజెక్ట్‌కు సంబంధించిన టైటిల్‌ని గ్లింప్స్ ద్వారా రివీల్ చేశారు. సినిమా టైటిల్‌ని 'కింగ్ 100' అని పెట్టడం గమనార్హం. అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్ పై అక్కినేని ఫ్యామిలీ నిర్మాణంలో తమిళ దర్శకుడు రా కార్తీక్ దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కుతుంది. నేడు నాగార్జున పుట్టిన రోజు సందర్భంగా సినిమా ఫస్ట్ గ్లింప్స్ ని రిలీజ్ చేసారు. మనుషుల్లో రెండు రకాలు.. ఒకటి డబ్బున్న వాళ్లు, మరొకటి డబ్బు లేని వాళ్లు అనే పవర్ ఫుల్ డైలాగ్‌తో నాగార్జునని పరిచయం చేశారు. గ్లింప్స్ చూస్తుంటే డబ్బు లేని ఓ పేదవాడు కసిగా ఎదిగి, మోసాలు చేస్తూ బాగా సంపాదించి కింగ్ స్థాయికి ఎలా ఎదిగాడు అనేది చిత్రంలో చాలా ఇంట్రెస్టింగ్‌గా చూపించనున్నట్టు అర్థమవుతుంది. మరోవైపు చిత్రంలో ఫాదర్ ఎమోషన్ కూడా ఉండబోతుంది అని, నాగార్జున ఇందులో ప్లాష్ బ్యాక్ లో యంగ్ వర్షన్ లో కూడా కనిపించబోతున్నట్టు అర్థమవుతుంది. చిన్న గ్లింప్స్




ఇప్పుడు సోషల్ మీడియాలో ఆసక్తిని రేపుతోంది. కేవలం కొద్ది సెకన్ల వీడియోతోనే చిత్రంపై భారీ హైప్‌ను క్రియేట్ చేయడంలో మేకర్స్ సక్సెస్ అయ్యారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌లో మరో ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్న అంశం టబు ఎంట్రీ. గతంలో నాగార్జున, టబు కలిసి నటించిన 'నిన్నే పెళ్లాడుతా', 'ఆవిడా మా ఆవిడే' వంటి సినిమాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. చాలా ఏళ్ల తర్వాత ఈ హిట్ జోడీ మళ్లీ ఒకే సినిమాలో కనిపించబోతుండటంతో అభిమానుల్లో ప్రత్యేకమైన ఆసక్తి నెలకొంది. ఈ సినిమాలో టబు పాత్ర చాలా కీలకంగా ఉంటుందని, కథను మలుపు తిప్పే పవర్‌ఫుల్ క్యారెక్టర్‌లో ఆమె కనిపించనున్నారని సమాచారం. దీంతో నాగ్-టబు కాంబినేషన్‌పై అంచనాలు భారీగా పెరిగాయి. 'నితమ్ ఒరు వానమ్' చిత్రంతో దర్శకుడిగా తనదైన గుర్తింపు తెచ్చుకున్న రా కార్తీక్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. భావోద్వేగాలకు, కమర్షియల్ ఎలిమెంట్స్‌కు సమాన ప్రాధాన్యం ఇస్తూ నాగార్జున 100వ సినిమాను ప్రత్యేకంగా తీర్చిదిద్దుతున్నట్లు తెలుస్తోంది. గ్లింప్స్‌ను బట్టి చూస్తే, దర్శకుడు ఈసారి ఫీల్‌గుడ్ కథకు భిన్నంగా మిస్టరీ, యాక్షన్ అంశాలతో కూడిన కథను ఎంచుకున్నట్లు అంచనా వేస్తున్నారు. ఈ భారీ ప్రాజెక్ట్‌కు రాక్‌స్టార్ దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. ఈ మూవీని డిసెంబర్ 24న విడుదల చేయనున్నట్లు గ్లింప్స్ తో తెలియజేశారు.

## యశ్‌ది చాలా సున్నితమైన మనస్తత్వం

### తారా సుతారియా

పాన్ ఇండియా స్టార్ యశ్ కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం 'టాక్సిక్'. గీతూ మోహన్‌దాస్ దర్శకత్వం వహించిన ఈ సినిమా ఇటీవల విడుదలై మిశ్రమ స్పందన అందుకుంటోంది. ఇందులో రెబెక్కా అనే కీలక పాత్రలో బాలీవుడ్ భామ తారా సుతారియా నటించిన విషయం తెలిసిందే. తాజాగా ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడిన ఆమె.. యశ్ వ్యక్తిత్వం గురించి పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. సినిమాలోని పాత్రలతో పోలిస్తే, నిజ జీవితంలో యశ్ పూర్తిగా భిన్నమని పేర్కొన్నారు. యశ్‌ను 'మేల్ ఫెమినిస్ట్' అనొచ్చా?అన్న ప్రశ్నకు ఆమె బదులిచ్చారు 'కచ్చితంగా అనొచ్చు. ఆయన చాలా సున్నితమైన వ్యక్తి. ఎదుటివారి గురించే ఎక్కువగా ఆలోచిస్తుంటారు. సినీ పరిశ్రమలో ఇలాంటి వ్యక్తులు ఉ ఒడడం చాలా అరుదు. అందరిపైనా యశ్ ఎంతో గౌరవాన్ని ప్రదర్శిస్తారు' అని పేర్కొన్నారు.






## మహేంద్రగిరి వారాహి ట్రైలర్ విడుదల

టాలీవుడ్ నటుడు సుమంత్ హీరోగా, సంతోష్ జాగర్లపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న డివోషనల్ మిస్టరీ థ్రిల్లర్ 'మహేంద్రగిరి వారాహి' ఈ సినిమాకు సంబంధించిన థియేట్రికల్ ట్రైలర్‌ను శుక్రవారం చిత్రబృందం విడుదల చేసిన సంగతి తెలిసిందే. అయితే ఈ ట్రైలర్ సోషల్ మీడియాలో వ్యూస్‌తో దూసుకుపోతుంది. ఇక రాజశ్యామల ఎంటర్‌టైన్‌మెంట్స్, బ్రిడ్జ్ ఫిలిమ్స్ బ్యానర్లపై లక్ష్మణ్, కలిపు మధు సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్ర ట్రైలర్‌ను ప్రముఖ డైరెక్టర్ వెంకీ అట్లూరి ముఖ్య అతిథిగా విచ్చేసి ఆవిష్కరించారు. పరమశివుడి ఆజ్ఞతో మహేంద్రగిరిలో కొలువుదీరిన గ్రామదేవత 'వారాహి మాత' నేపథ్యంతో ఈ కథ సాగుతుంది. మహేంద్రగిరి రాజకుటుంబానికి చెందిన వారు గత 150 ఏళ్లుగా అనుమానాస్పద స్థితిలో వరుసగా మరణిస్తుండటం, ఇదంతా అమ్మవారి శాపం వల్లే జరుగుతోందనే నమ్మకం చుట్టూ ఈ ట్రైలర్ ఆద్యంతం ఉత్కంఠను రేకెత్తిస్తోంది. ఆ రహస్యాన్ని ఛేదించేందుకు హీరో సాహసించే తీరు సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతోంది. ఈ చిత్రంలో వారాహి మాతగా నటి ఐశ్వర్య రాజేష్ అలరించనుండగా, 'స్టార్ బాయ్' సిద్ధు జొన్నలగడ్డ ఒక కీలక పాత్రలో ట్రైలర్‌లో సర్ ప్రైజ్ ఎంట్రీ ఇచ్చి అంచనాలను అమాంతం పెంచేశారు. వీరితో పాటు మీనాక్షి గోస్వామి, మాళవిక నాయర్, బ్రహ్మానందం, వెన్నెల కిశోర్, రాజీవ్ కనకాల తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. అనూప్ రూబెన్స్ సంగీతం అందిస్తున్న ఈ సోషియో-ఫాంటసీ థ్రిల్లర్‌ను ప్రపంచవ్యాప్తంగా సెప్టెంబర్ 11, 2026న గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు. వారాహికి ఎదురెళ్లి ఈ శాపాన్ని తప్పిస్తాను' అంటున్నారు సుమంత్. మహేంద్రగిరి రాజ వంశస్థులకు వారాహి అమ్మవారి శాపం ఎలా తగిలింది? అందుకు కారణం ఏంటి? మరి అన్నట్లుగానే ఆ శాపం ఏంటో కథానాయకుడు కనుగొన్నాడా? శాప విమోచనకు ఏం చేశాడు? అన్నది తెలియాలంటే 'మహేంద్రగిరి వారాహి' చూడాల్సిందే. సుమంత్ హీరోగా దర్శకుడు సంతోశ్ జాగర్లపూడి తెరకెక్కించిన సోషియో ఫాంటసీ చిత్రమిది. ఐశ్వర్య రాజేశ్, మాళవికా నాయర్, తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ మూవీ సెప్టెంబరు 11న విడుదల కానుంది. ఈ సందర్భంగా శుక్రవారం ట్రైలర్ విడుదలైంది. ఆద్యంతం థ్రిల్ పంచేలా మూవీని తీర్చిదిద్దినట్లు ప్రచార చిత్రం చూస్తే అర్థమవుతోంది.




## ఇరుముడి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమ్‌కు రెడీ

మాస్ మహారాజా రవితేజ హీరోగా, ప్రతిభావంతుడైన దర్శకుడు శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కిన హార్ట్ టచింగ్ బ్లాక్‌బస్టర్ చిత్రం 'ఇరుముడి'. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ అత్యున్నత ప్రమాణాలతో నిర్మించిన ఈ చిత్రం ఆగస్ట్ 21న ప్రేక్షకుల ముందుకు వచ్చి అనూహ్య విజయాన్ని సొంతం చేసుకుంది. మొదటి రోజు నుంచే అద్భుతమైన పాజిటివ్ టాక్‌తో బాక్సాఫీస్ వద్ద రికార్డు స్థాయి కలెక్షన్లతో దూసుకుపోతోంది. రవితేజ కెరీర్‌లోనే ప్రత్యేకమైన చిత్రంగా నిలిచిన 'ఇరుముడి', భావోద్వేగాలతో కూడిన కంటెంట్‌తో అన్ని వర్గాల ప్రేక్షకులను థియేటర్లకు రప్పిస్తూ ఘన విజయంతో సక్సెస్‌ఫుల్‌గా రన్ అవుతోంది. పాన్-ఇండియా స్థాయిలో విడుదలైన యశ్ 'టాక్సిక్' వంటి భారీ బ్జడెట్ చిత్రం బరిలోకి దిగినప్పటికీ, 'ఇరుముడి' క్రేజ్ ఏమాత్రం తగ్గకపోవడం విశేషం. ఆ పోటీని సైతం తట్టుకుని రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఓవర్సీస్‌లోనూ హౌస్‌ఫుల్ బోర్డులతో స్టాం÷-రగ్ కలెక్షన్లను రాబడుతోంది. రవితేజ మార్క్ ఎనర్జీతో పాటు త్రినాథ్ పాత్రలో ఆయన పండించిన ఎమోషన్స్, శివ నిర్వాణ టేకింగ్, జీవీ ప్రకాశ్ సంగీతం సినిమా విజయానికి ప్రధాన బలంగా నిలిచాయి. థియేటర్లలో ఇంకా కలెక్షన్ల సునామీ కొనసాగుతున్న తరుణంలోనే, ఈ చిత్ర డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులకు సంబంధించిన ఆసక్తికరమైన సమాచారం బయటకు వచ్చింది. ÷ాజా సమాచారం ప్రకారం, ప్రముఖ దిగ్గజ ఓటీటీ ఎ÷-లాట్‌ఫామ్ 'నెట్‌ప్లిక్స్' ఈ చిత్ర డిజిటల్ రైట్స్‌ను భారీ ఫ్యాన్సీ ధరకు దక్కించుకుంది. థియేట్రికల్ రన్ ముగిసే సమయానికి, అంటే సెప్టెంబర్ 18 నుంచి 'ఇరుముడి' చిత్రాన్ని నెట్‌ప్లిక్స్‌లో అధికారికంగా స్ట్రీమింగ్ చేయనున్నట్లు తెలుస్తోంది. సినిమా విడుదలైన నాలుగు వారాల విండో తర్వాత తెలుగుతో పాటు ఇతర ప్రధాన భాషల్లో కూడా ఇది అందుబాటులోకి రానుంది.

PUBLISHED AND OWNED BY DUSARI KASTURI, PRINTER B SANDHYA RANI PRINTED AT M/S.KAKATIYA PRINTERS 2-24-96/9, NEAR SRI KRISHNA PHARMA, LAXMINARAYANA NAGAR, IDA UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500039, PUBLISHED AT H.NO. 9-875/104/3A, BAPUJI COLONY, NEAR VIJAYA HOSPITAL NAGARAM , MEDCHAL MALKAJ-GIRI, TELANGANA - 500083.,EDITOR : DUSARI RAVINDER GOUD, PRGI REGISTRATION NUMBER TGTEL/25/A1132, CELL :8522055889 MAIL ID:dusari kasturi9@gmail.com